PLATINUM JUBILEE YEAR

Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు
[illegible] : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి : 77 | సంచిక : 12 | 24.3.2006 | శుక్రవారం | 12పేజీలు | విడిప్రతి: రూ.3.00

**డి.ఆర్.ఉత్తమలో విందుల పసందు**

- బర్త్‌డే పార్టీలు, ఎంగేజ్‌మెంటు ఫంక్షన్లు, వివాహాలు తదితర శుభకార్యాలకు, కార్పొరేట్ మీటింగులు, సెమినార్లు, గెట్‌టుగెదర్లు మరియు కాన్ఫరెన్స్‌లకు అత్యాధునిక వసతులతో , అన్ని హంగులతో బేంక్వెట్ హాల్స్ (అన్ని రకముల ఎలక్ట్రానిక్ - సౌండ్, మ్యూజిక్, వీడియో పరికరములతో సహా)
- ప్రతి రోజు వివిధ రకాల వెజ్&నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ.160/-లకే

మరెన్నో వసతులతో మీకు స్వాగతం పలికే
మీ డి.ఆర్.ఉత్తమ ★ ★ ★ హోటల్

D.R. UTTHAMA HOTEL

23/976, Dhandayudha Puram, Nellore - 3. Phones : 2317777 - 10 Lines

# బాబు నోరు జారడంతో వైఎస్‌కు వూరట!

ఎడారిలో చిక్కుకు పోయిన వాడికి ఒయాసిస్సు వలె ఎదురైంది - ఎల్లంపల్లిపై చంద్రబాబు నాయుడు మాటజారుడు. కాలు జారినా వెనక్కు తీసుకోగలము కానీ నోరు జారితే ఇక అంతే సంగతులు అని పెద్దలు ఊరికే చెప్పలేదు. దాదాపు ఇరవై రోజుల పాటు ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ల త్రాగించిన తెలుగుదేశం పార్టీ చివరకు తానే ప్రభుత్వాన్ని ఆ గండం నుంచి గట్టెక్కించడం విచిత్రం. రాజకీయాలలో ఇటువంటి విచిత్రాలు జరగడం సాధారణమే అయినా, ఇంత తీవ్రమైన అంశంలో ప్రధాన ప్రతిపక్ష నేత అంత సునాయాసంగా ప్రభుత్వానికి చిక్కిపోవడం మాత్రం ఆ పార్టీకి దిమ్మతిరిగే దెబ్బ కొట్టింది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు టెండర్లలో జరిగిన అవినీతిపై తెలుగుదేశం పార్టీ బయటపెట్టిన పత్రాలు, చూపిన ఆధారాలు ముఖ్యమంత్రితో సహా ప్రభుత్వంలోని ప్రతి ఒక్కరినీ కలవర పెట్టాయన్నది వాస్తవం. ప్రతిపక్షం అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేని సంకట స్థితిలో పడిపోయింది ప్రభుత్వం. దీనివల్లే ఈ అంశంపై చర్చకు ముగింపు పలకకుండా ఇన్ని రోజులు నెట్టుకుంటూ వచ్చింది. రోజా ఎవరో ఒకరిచేత మాట్లాడించిందే మాట్లాడిస్తూ కాలం గడిపింది. దీనికి ఎట్లా ముగింపు పలకాలో అర్థంకాక పోవడమే అందుకు కారణం. ప్రతిపక్షం అడిగినట్లు ఫైళ్లు స్పీకర్ ముందు పెడితే లోగుట్టు బయటపడి పోతుంది. ఫైళ్లకు బదులుగా న్యాయ విచారణ, లేదా సిబిఐ దర్యాప్తు లేదా సభా సంఘం నియామకం వంటి నిర్ణయాలు తీసుకుంటే చాలా మంది అధికారులకు బేడీలు పడక తప్పదు. జలయజ్ఞం త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఇస్తున్న ఆదేశాలను ఆసరాగా తీసుకుని అధికారులు ప్రతి ప్రాజెక్టులోను కాంట్రాక్టర్లకు ప్రభుత్వ ధనాన్ని దోచి పెట్టారు. అందుకోసం నిబంధనలను అడ్డదిడ్డంగా అతిక్రమించారు. ఎంత చిన్న దర్యాప్తులోనైనా ఏ ఒక్క ఫైల్ చూసినా ఈ అక్రమాలు కళ్లకు కట్టినట్లు కన్పడి పోతాయి. ఇక ఎల్లంపల్లి వంటి కీలక

తరువాయి 7వ పేజీలో

> **ప్రతిపక్ష నాయకుని ఏమరుపాటు వల్ల ఎల్లంపల్లి విషయం లోనేకాదు, మొత్తం జలయజ్ఞం అవినీతి కుంభకోణాల నుంచే ప్రభుత్వానికి విముక్తి లభించింది. రేపటి నుంచి ప్రతిపక్షాలు ఏ ఆరోపణలు చేసినా, ఆధారాలు చూపినా అవన్నీ నకిలీ అని చెప్పి తప్పించుకొనే అవకాశం చిక్కింది.**

## ముఖ్యమంత్రి అతి జాగ్రత్త

ఎల్లంపల్లి వివాదం శాసనసభలో శిఖరాగ్ర స్థాయికి చేరడంతో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఏ ఫైల్ మీద సంతకం చేయడానికి కూడా సందేహిస్తున్నారు. తన వద్దకు వచ్చే ఫైళ్లను, అధికారుల మాట మీద నమ్మకంతో పెద్ద పట్టింపులు లేకుండా సంతకం చేసి పంపేయడం ఆయనకు అలవాటు. అందువల్ల సిఎం పేషీలో ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చకచకా క్లియర్ అయిపోతాయన్న పేరు వచ్చింది. చంద్రబాబు హయాంలో అయితే వేలాది ఫైళ్లు నెలల తరబడి దుమ్ము కొట్టుకుంటూ పడి వుండేవి. కానీ ఎల్లంపల్లిపై రగడ మొదలైనప్పటి నుంచి వైఎస్‌లో కూడా మార్పు వచ్చింది. తన వద్దకు వచ్చే రొటీన్ ఫైళ్లు తప్ప, ఇతరత్రా వాటన్నిటి మీద ఏ నిర్ణయం తీసుకోవడానికీ ఇష్టపడడం లేదాయన. ఉద్యోగులు, అధికారులపై అవినీతి ఆరోపణలు, సస్పెన్షన్ల వంటి ఫైళ్లను కూడా అదే కోణంలో చూస్తున్నారు. గత ఇరవై

తరువాయి 6వ పేజీలో

## బాబుగారూ... బాగున్నారా...

మాటకు మాట బదులు చెప్పే అవకాశం అరుదుగా కానీ రాదు. ఎన్టీఆర్ పెద్ద అల్లుడు, ప్రస్తుత కేంద్రమంత్రి పురంధరేశ్వరి పతిదేముడు దగ్గుపాటి వెంకటేశ్వరరావుకు అటువంటి అవకాశం చిక్కింది మొన్నొక రోజు. ఒక ప్రయివేటు శుభకార్యానికి హాజరైన ఆయనకు మాజీ ముఖ్యమంత్రి, తోడల్లుడు చంద్రబాబు నాయుడు ఎదురు పడ్డారట. 1995లో ఎన్టీఆర్‌తో విభేదించినప్పటి నుంచి వీరిద్దరి మధ్య పెద్దగా మాటలు లేవు; ఒకరింటికి మరొకరి రాకపోకలూ లేవు. ఇటువంటి పబ్లిక్ ప్రదేశాలలో మర్యాదకు బ్రదర్ అంటే బ్రదర్ అనుకోవడం మాత్రమే జరుగుతున్నది. చంద్రబాబు మీద కోపంతోనే దగ్గుపాటి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను బాగానే ఆదరించింది. ఆయనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడంతో పాటు, పురంధరేశ్వరిని బాపట్ల ఎమ్పీ చేసి, ఆ తర్వాత కేంద్రమంత్రి కూడా చేసింది. గతంలో ఒకసారి తనకు ఎదురుపడిన చంద్రబాబు, మీరు అనవసరంగా కాంగ్రెస్‌లో చేరారు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను కాంగ్రెస్‌వాదులు ఎట్టి పరిస్థితులలోను నమ్మరు, మీరెంత ప్రాకులాడినా మీకు ఆ పార్టీలో గుర్తింపు రాదు, గౌరవమూ దక్కదు అని ఎగతాళి చేశాడట. దానికి బదులు చెప్పే సమయం కోసం ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తుండిన దగ్గుపాటికి ఈ శుభకార్యంలో ఆ అవకాశం కన్పించడంతో మహా ఉత్సాహపడి పోయాడు.

చంద్రబాబు లోపలకు రాగానే, తానే ఎదురు వెళ్లి "ఏమి బాబుగారూ, బాగున్నారా" అని పలకరించారు. దగ్గుపాటిని చూడగానే తత్తరపడ్డారట చంద్రబాబు. తప్పించుకుని పోజుశాడట కానీ, దగ్గుపాటి మాటలు కొనసాగిస్తూ నిలేశాడు. నా పెద్ద కూతురు నిశ్చితార్థానికి మీరు రాలేదేమి అని అడిగాడట. ఆ రోజు నేను చాలా బిజీగా వున్నందువల్ల రాలేక పోయానన్నాడట ఆయన. ఆ రోజు అసెంబ్లీ సమావేశాలు లేవు కదా, బిజీ ఏముంది అని ప్రశ్నించేసరికి, అమర్‌సింగ్ వచ్చాడు అని బదులిచ్చాడట. అమర్‌సింగ్ హైదరాబాదులో ఒక్క అరగంట కూడా లేడట కదా, పత్రికలలో చదివాను, దానికంత బిజీ ఏమిటి అని మళ్లీ రెట్టించాడట. ఈ ప్రశ్నల వర్షం చూసిన చంద్రబాబు, దగ్గుపాటి పిలుస్తున్నా విన్పించుకోకుండా అక్కడ నుంచి వెళ్లిపోయాడట. ఆ సమయంలో అక్కడ ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకుడు ఐ.వెంకటరావు గారు వుండినారు. వీరిద్దరి సంవాదం చూస్తుండినాడు. ఆ తర్వాత దగ్గుపాటి, వెంకటరావు వైపు తిరిగి, కాంగ్రెస్‌లో చేరినందుకు నన్ను గేలి చేసిన చంద్రబాబుకు కాంగ్రెస్‌లో మాకు లభించిన ఆదరణ జ్ఞాపకం చేసి, నీ దగ్గర వుంటే మాకీ గౌరవం దక్కేదా అని నిలదీయాలనుకున్నాను, కానీ తప్పించుకు పారిపోయాడు అని గేలి చేశాడట. ఈలోగా చంద్రబాబు కుమారుడు లోకేష్

తరువాయి 7వ పేజీలో

నెల్లూరు ప్రజల పుత్రిక – నిజాల నిప్పు కణిక

**జమీన్‌రైతు**

తెలుగు వార పత్రిక

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 2327354



మీ ఆశలకు ఇప్పుడు జమీన్‌రైతు

**గొడుగు పట్టింది**

చందా ఒకటే - లాభాలు రెండు

- ఏడాది పాటు పత్రికా పఠనం
- "2 ఫోల్డ్" గొడుగు ఉచితం




**కేవలం రూ.150లు**

జమీన్‌రైతు సంవత్సర చందాగా చెల్లించిన వారికి ఈ నూతన సంవత్సర కానుక సమర్పిస్తున్నాము!

(1-12-2005 నుండి 31-3-2006వరకు మాత్రమే)

చందా చెల్లించిన వెంటనే రశీదుతోపాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డిడి (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు మా కార్యాలయానికి స్వయంగా వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు చెప్పే నిజాలు - అక్రమార్కుల గుండెల్లో శరాఘాతాలు

# వ్యయలో కష్టాలు - సుఖాలు సమంగా వుంటాయి

ఉగాది అనే మాట 'యుగాది' అనే రూపం నుంచి వచ్చింది. యుగమంటే సంవత్సరం. కాని "యుగం భవేద్వత్సర పంచకేన, యుగాని తు ద్వాదశ వర్ష షష్ట్యామ్" అనే ప్రమాణం వల్ల ప్రభవాది 60 సంవత్సరాలలో ప్రతి ఐదు సంవత్సరాలు - సంవత్సర, పరివత్సర, ఇదావత్సర, ఇదువత్సర, ఇద్వత్సరమనే పేర్లతో పిలువబడతాయి. ఈ విధంగా 60 సంవత్సరాల కాలగమనాన్ని 12 విభాగాలుగా చేసే పద్ధతి కృష్ణ యజుర్వేద తైత్తిరీయ బ్రాహ్మణములో వుంది. ఈ వరుసలో ఐదవది, ఇద్వత్సర నామము గల ఈ వ్యయ సంవత్సరం ప్రజాపతి దేవతాకమైనది. దీనివల్ల ఈ యేడాది వెండి దానం చేయడం విశేష పుణ్యఫల ప్రదమగుతుంది.

ఇప్పటి వరకు 5107 కలియుగాబ్దాలు గడిచాయి. మన దేశంలో కాలమాన వ్యవస్థలో వింధ్యకు ఉత్తర ప్రాంతం బార్హస్పత్యమానమని; వింధ్య వెంకటాచల పర్వత మధ్య ప్రాంతం చంద్రమానమని; తిరుపతికి దక్షిణ దేశ భాగము సౌరమాన రీత్య "వ్యయ" సంవత్సరమని చెప్పాలి. కాని బార్హస్పత్యమాన రీత్య "వికారి" సంవత్సరంగా ఈ సంవత్సరం వ్యవహారంలో వుంటుంది. "వ్యయ" సంవత్సరాధిపతి రాహువు. ఛాయాగ్రహం కావున ప్రభువులు ధర్మాసక్తులై వుంటారు. వైద్య, శాస్త్ర రంగాలకు, ప్రజాసౌకర్య పోషణకు ఎక్కువ ఖర్చు (ఉత్పాదకేతర ఖర్చు) చేస్తారు. పగటి పూట ఆర్ద్ర కార్తె ప్రవేశం వల్ల సస్య వృద్ధి సామాన్యం. వర్ష ప్రతిబంధకాలుంటాయి. 4 కుంచాల వర్షం కురుస్తుంది. కాని ప్రజలకు జల సమస్య తప్పదు. వరి కంటె మెట్ట పంటలు, అపరాలు బాగా పండుతాయి. అధికార వైభవానికి ఖర్చు ఎక్కువ పెట్టారు. వింధ్యోత్తర దేశాన ప్రజానష్టం, ప్రకృతి ప్రళయాలు హెచ్చుగా వుంటాయి. ఆగమ సంప్రదాయాలు దైవభక్తి ప్రజలలో పెరుగుతుంది. సంవత్సర ప్రథమార్థంలో ఎండలు ఎక్కువగా వుంటాయి. దేశంలో అంతర్గత శత్రువుల వల్ల ప్రజానష్టం, సంపద నష్టం వుంటుంది. శ్రావణ మాసం నుంచి మార్గశీర్ష మాసం వరకు మంచి వర్షాలు దేశమంతటా కురుస్తాయి. ధరలు బాగా పెరుగుతాయి. పుష్య మాఘ, ఫాల్గుణాలలో ఆహార వస్తువులు, తైలము, గృహ నిర్మాణ సామగ్రి ధరలు పెరుగుతాయి. పెద్ద వాహన ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలుండే సూచనలున్నాయి. ఆర్థిక రాజకీయ నేరాల సంఖ్య పెరుగుతుంది.

**వర్షాలు బాగా పడతాయి. పంటలు బాగా పండుతాయి. కాని రైతుకు గిట్టుబాటు ధర వుండదు. ఎండలు, నిత్యావసర వస్తువుల ధరలు మండుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఢోకా లేదు. ప్రకృతి వైపరీత్యాలు మాత్రం పొంచి వున్నాయి.**

## నవనాయక ఫలితాలు

సంవత్సరాధిపతి రాజు; మేష సంక్రమణ వారాధిపతి మంత్రి; మిథున సంక్రమణ వారాధిపతి సేనాధిపతి; కర్కాటక సంక్రమణ వారాధిపతి సస్యాధిపతి; ధనుస్సంక్రమణ వారాధిపతి ధాన్యాధిపతి; సింహ సంక్రమణ వారాధిపతి అర్ఘాధిపతి; ఆర్ద్ర కార్తె ప్రవేశ వారాధిపతి మేఘాధిపతి; తులా మకర సంక్రమణ వారాధిపతులు రస, నీరసాధిపతులు; వీరే ప్రతి సంవత్సరంలో నవనాయకులు; 21మంది ఉప నాయకులున్నారు. వీరి గతి విధులతోనే దేశంలో రకరకాల సంఘటనలు చోటు చేసుకొంటాయి.

రాజు, మేఘాధిపతి, రసాధిపతి, అర్ఘాధిపతి, మేఘాధిపతి గురువు అవడం వల్ల దేశంలో సత్కర్మలు పెరగడం రాజకీయ స్థిరత్వం, ధరలు పెరగటం, దేశమంతటా అనుకూల వర్షం, దక్షిణ దేశంలో కుంభవృష్టి కురుస్తుంది. చెరకు, చక్కెర, కొబ్బరి, నువ్వులు, నూనెలు, ఉల్లి వంటి నిత్య ఉపయోగ వస్తువుల ధరలు మధ్యమంగానే వుంటాయి. బంగారు, లోహాలు, తైలము (వాహన ఇంధనాలు)ల ధరలు పెరుగుతాయి.

మంత్రి శుక్రుడైనందు వల్ల పురుషులు, స్త్రీలోలురై వుంటారు. పరిపాలన బాగున్నా, ఉపద్రవం కల్గించే నిర్ణయాలు చేస్తూ సర్దుబాటు చేసుకొంటారు. కళా సాహిత్య వేద వాఙ్మయాలకు వృద్ధి, ఆదరణ పెరుగుతుంది.

సస్యాధిపతి చంద్రుడైనందు వల్ల మెట్ట భూములు, అపరాలు, ఫలజాతులు పుష్కలంగా పండుతాయి. వృక్ష జాతులు, కందమూలాలు బాగానే పండుతాయి.

ధాన్యాధిపతి శని కావడంతో నల్ల, మెట్ట భూములు బాగా ఫలితాన్నిస్తాయి. కాని రైతులకు వ్యాపారాలు లేక నలిగిపోతారు. మాగాణి ధాన్యానికి ప్రకృతి ప్రళయం వల్ల నష్టం వాటిల్లుతుంది.

నీరసాధిపతి రవి అవడం వల్ల కలప, సిమెంటు ధాతు లోహాల ఉత్పత్తి బాగున్నా ధరలు అందుబాటులో వుండవు.

నవ నాయకులలో ఏడుగురు శుభులు, ఇద్దరు పాపులు. ఉప నాయకులలో 15 మంది శుభులు, ఆరుగురు పాపులయ్యారు.

## వర్ష లగ్న - జగల్లగ్నాలు

పాడ్యమి ప్రారంభ తిథి సమయంలోని లగ్నం వర్ష లగ్నం. మేష సంక్రమణ ప్రారంభ సమయాన లగ్నం జగల్లగ్నం.

వర్షలగ్నం సింహం. లగ్నాధిపతి రవి అష్టమస్థితి. చంద్రరాహువులు అష్టమ స్థితి. తృతీయ రాజ్యాధిపతి శుక్రునికి షష్ఠ స్థితి. శని వ్యయం, బుధుడు సప్తమం. కుజుడు రాజ్యభావ స్థితిలో వున్నారు. దీనివల్ల తరచూ రాజకీయ వైరుధ్యాలు సంభవిస్తాయి. ఆర్థిక రంగాన ఒడిదుడుకులు జరిగి సర్దుబాటవుతాయి. రాష్ట్రంలో వ్యవసాయ, నీటి పారుదల, విద్యుత్ రంగాలు ముందుకు సాగుతూ అపనిందలు పాలవుతాయి. రవి అష్టమస్థితి వల్ల అధికారులు శిక్షింపబడతారు. ప్రణాళికేతర వ్యయం ఎక్కువవుతుంది. కుజుని దశమ స్థితి వల్ల రాష్ట్ర ప్రభుత్వం స్థిరంగా వుంటుంది. శుక్రుని షష్ఠ స్థితి వల్ల ధన దుర్వ్యయం, కార్మిక, కర్షక వర్గాలకు బాధలు తప్పవు. సంవత్సరం రెండవ సగం నుంచి పరిపాలన సజావుగా ప్రజారంజకంగా సాగుతుంది. చంద్రుడు, శని అష్టమ వ్యయ స్థితుల వల్ల రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు రెండు మూడు పర్యాయాలు సంభవిస్తాయి.

జగల్లగ్నం మేషము. కుజునికి తృతీయ స్థితి, సూర్యునికి లగ్నాన ఉచ్ఛ స్థితి; సప్తంలో గురు, చంద్రులు; దశమంలో శని చూడటం, శుక్రునికి లాభ స్థితి వుంటుంది. దీనివల్ల దేశంలో ప్రజానుకూల కార్యాలు నిర్వహింపబడుతాయి. విద్యా, వైద్య, సాంకేతిక రంగాలలో మంచి అభివృద్ధి వుంటుంది. శృంగార, వినోదాలకు ప్రజలు ఎక్కువ ఖర్చు చేస్తారు. వ్యవసాయ రంగం కొంత దెబ్బ తింటుంది. బుధుని వ్యయ స్థితి వల్ల న్యాయస్థానాలతో

**ఉగాది పంచాంగం**

**స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఏ**

ప్రభుత్వం అభిశంసింపబడుతుంది. చతుర్థ శని స్థితి గతుల వల్ల స్వల్పంగా ఆర్థిక ఒడిదుడుకులు, క్రీడా, సినీ పరిశ్రమలలో వృద్ధి లేకుండా వుంటాయి. లగ్నాన రవి

| రాశులు | ఆదాయ వ్యయాలు | రాజపూజ్య అవమానాలు |
|---|---|---|
| మేషం | 11 - 5 | 2 - 4 |
| వృషభం | 5 - 14 | 5 - 4 |
| మిథునం | 8 - 11 | 1 - 3 |
| కర్కాటకం | 2 - 7 | 4 - 7 |
| సింహం | 5 - 5 | 7 - 7 |
| కన్య | 8 - 11 | 3 - 3 |
| తుల | 5 - 14 | 6 - 3 |
| వృశ్చికం | 11 - 5 | 2 - 6 |
| ధనుస్సు | 14 - 11 | 5 - 6 |
| మకరం | 2 - 8 | 1 - 2 |
| కుంభం | 2 - 8 | 4 - 2 |
| మీనం | 14 - 11 | 7 - 2 |

సర్వాదాయం : 87

సర్వ వ్యయం : 110

వుండి శనిచే చూడబడటం వల్ల నవంబరు - జనవరి మధ్య దేశ ప్రభుత్వంలో ఒడిదుడుకులుండి సర్దుబాటై స్థిరపడతాయి. శని అతిచారం వల్ల ఆగ్నేయ దక్షిణ నైరుతి

తరువాయి 6వ పేజీలో

# ఆనం వర్గానికి 'షాక్' ఇచ్చిన రాజ్యలక్ష్మమ్మ

నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నియమితుడైనాడు. సాధారణంగా గ్రంథాలయ సంస్థకు పెద్ద రాజకీయ ప్రాధాన్యత వుండదు. కానీ, ప్రస్తుత జిల్లా కాంగ్రెస్ వర్గ బల ప్రదర్శనల కోణం నుంచి చూస్తే మాత్రం, దీనికి ఎక్కడలేని ప్రాధాన్యత వస్తున్నది.

ప్రస్తుతం ఆ పదవిలో సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకరరెడ్డి అనుచరుడైన ఎర్రంరెడ్డి గోవర్ధనరెడ్డి కొనసాగుతున్నాడు. గోవర్ధనరెడ్డి వ్యక్తిగా వుత్తముడే కానీ, రాజకీయాలలో ప్రభాకరరెడ్డి గీసిన గీటు దాటడు. ప్రభాకరరెడ్డితో కలిసి తెలుగుదేశం నుంచి వలస వచ్చిన వాడాయన. తన మనిషిగా వచ్చాడు కాబట్టి, ఆయన్నే ఈ పదవిలో కొనసాగించాలని ప్రభాకరరెడ్డి కోరడంతో ఇంతకాలం జనార్ధనరెడ్డి చూసీ చూడనట్లు వుండిపోయాడు. అయితే ఆ ప్రభాకరరెడ్డి తనను వదలి వెళ్లిపోయిన తర్వాత ఆయనకిచ్చిన మాటను ఎందుకు పాటించాలన్న ఆలోచన ఒకటి వుండింది. ప్రభాకరరెడ్డిలో ఏదైనా మార్పు వస్తుందేమోనని ఇంత కాలం ఓపికగా ఎదురు చూశారు. కానీ ఆయనలో ఆ సూచనలు కన్పించడం లేదు. ఆనం సోదరులతో కలిసి, జిల్లాలో జనార్ధనరెడ్డికి వ్యతిరేక దారిలో నడుస్తున్నాడాయన.

మరొక ప్రక్క జిల్లా మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ గారికి గ్రంథాలయ సంస్థలను బాగా అభివృద్ధి చేయాలన్న కోరిక వుంది. అది ఆమె మంత్రిత్వ శాఖలో ఒక భాగం. ప్రతి గ్రంథాలయాల సంస్థ శాఖను బాపూజీ విజ్ఞాన కేంద్రాలుగా మార్చి, ఇంటర్నెట్ సదుపాయంతో అన్ని ఆధునిక వసతులు సమకూర్చి, దేశంలోనే వుత్తమమైన గ్రంథాలయ విభాగంగా మలచాలన్నది ఆమె కోరిక. అందుకు తగినట్లు ప్రణాళికలు రచిస్తూ వస్తున్నారు. నెల్లూరు తన స్వంత జిల్లా కాబట్టి, తన స్వంత ఆలోచనలకు తగినట్లుగా పనిచేసే వాడిని ఈ పదవిలో పెట్టాలని ఆమె తలపోశారు. ఇంకొక ప్రక్క కోవూరు రాజకీయాలలో దేవకుమార్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు అసత్యాలు అని నిరూపించుకోవలసిన అవసరం ఆ ఎమ్మెల్యేకి ఏర్పడింది. కోవూరులో కాంగ్రెస్ వాదులను నిర్లక్ష్యం చేసి, తెలుగుదేశం నుంచి వలస వచ్చిన వారికి పెద్ద పీట వేస్తున్నారన్నది దేవకుమార్‌రెడ్డి ఆరోపణ. ఆ కుంటిసాకు చూపించే ఆయన జనార్ధనరెడ్డిని వదలి ఆనం వారితో వెళ్లిపోయాడు. కోవూరులో నిఖార్సైన కాంగ్రెస్ వాది ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి అవకాశం ఇస్తే ఈ ఆరోపణకు సరైన సమాధానం చెప్పినట్లు అవుతుందని పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సిఫార్సు చేశాడు. అందరి అభిప్రాయాలూ కలవడంతో ప్రవీణ్‌ను అదృష్టం వరించింది.

**జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షునిగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నియామకం జిల్లా రాజకీయాలను ఒక్క కుదుపు కుదిపింది. జిల్లా విషయంలో తనకు అందరూ సమానమే అని, ఎవరినీ ప్రత్యేక దృష్టితో చూడడం తన అభిమతం కాదని చెప్పకనే చెప్పాడు ముఖ్యమంత్రి.**

అయితే ఆనం వర్గానికి, మరీ ముఖ్యంగా ప్రభాకరరెడ్డికి మాత్రం ఇది కరెంటు షాక్ వలె తగిలింది. జిల్లా ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశం జరుపుతున్నప్పుడే ఈ వార్త వారి చెవిన పడింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి తమకు జిల్లా పెత్తనం అప్పచెప్పబోతున్నాడని; రేపటి మండలాల ఎన్నికలు తమ నేతృత్వంలో జరపమని ఆదేశించబోతున్నాడని ఆశగా వుండినారువారు. పత్రికా విలేకరులకు ఆ సమాచారం ముందుగానే చెప్పి, సమావేశం తర్వాత శుభవార్త విన్పిస్తాం అని హామీ కూడా ఇచ్చారట. కానీ అదే సమావేశంలో వున్నప్పుడే ఈ వార్త చెవిన పడడంతో బిత్తరపోయారు. సమావేశం కాగానే ఆనం సోదరులు, ప్రభాకరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి సిఎం వద్దకు వెళ్లారు. తమ తోటి నెలవల సుబ్రహ్మణ్యాన్ని కూడా వెంటబెట్టుక వెళ్లారు. ఇంతమంది ఎమ్మెల్యేలు ఒక వైపు వున్నాము అని ఆయన ముందు ప్రదర్శించి మరీ ఈ నియామకం రద్దు చేయించాలన్నది వారి ప్రయత్నం. కానీ ముఖ్యమంత్రి వారికి ఆ అవకాశం ఇవ్వలేదు. జిల్లా మంత్రి రాజ్యలక్ష్మమ్మ తనను ఎప్పుడూ ఏదీ అడగదని; ఈ చిన్న పదవి ఆమె అడిగింది కాబట్టి ఇచ్చానని; కాబట్టి దీనిని వివాదం చేయకుండా సర్దుకపొండి అని చెప్పి వెళ్లిపోయారట ఆయన. దానితో ఏమీ చేయలేక తెల్లముఖం వేసుకుని తిరిగి వచ్చేశారు.

ఈ సమావేశంలో వారు ఊహించినట్లుగా జిల్లా బాధ్యతలు ఆనం వారికి



అప్పచెప్పే విషయం కూడా ప్రస్తావించలేదు ముఖ్యమంత్రి. మొన్నటి మునిసిపల్ ఎన్నికలలో రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీస్తే నెల్లూరు నగరంలో మాత్రం పార్టీ బలహీన పడిందని; ఆ పరిస్థితి రేపటి మండల ఎన్నికలలో ఎదురు కాకుండా అందరూ కలిసి పనిచేయాలని; ఏదైనా

తరువాయి 6వ పేజీలో

## అవినీతికి అధికార ముద్ర

ఎల్లంపల్లి ప్రాజెక్టు టెండర్లలో జరిగిన గోల్మాల్ వ్యవహారంపై 16 రోజుల పాటు అసెంబ్లీలో జరిగిన చర్చ హాస్యాస్పదంగా ముగిసింది. రాష్ట్రంలో పుష్కలంగా అమలౌతున్న జలయజ్ఞం కార్యక్రమంలో వేల కోట్ల రూపాయల అవినీతి జరుగుతున్నదని ప్రతిపక్షాలు, పత్రికలు చాలాకాలం నుంచి ఆందోళన చేస్తున్నాయి. అయితే ఇవన్నీ గాలి మాటలని, సరైన సాక్ష్యాధారాలతో ముందుకు వస్తే ఎటువంటి విచారణకైనా సిద్ధమేనని ప్రకటిస్తూ వచ్చారు ముఖ్యమంత్రి. ఎల్లంపల్లి విషయంలో అటువంటి రుజువులను సభ ముందు పెట్టారు తెలుగుదేశం ఉపనేత దేవేంద్రగౌడ్. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని 1365 కోట్ల నుంచి 1755 కోట్లకు పెంచడంలో కాంట్రాక్టర్లు, ఉన్నతాధికారులు కుమ్మక్కై, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన తీరును అధికారిక పత్రాలే వెల్లడి చేసినట్లు సాక్ష్యాలు చూపారాయన. కేవలం 48 గంటల వ్యవధిలో 400కోట్ల రూపాయల మేర అంచనాల పెంచుకుని, రాష్ట్ర ఖజానాను దోపిడీ చేశారన్నది తెలుగుదేశం ఆరోపణ. ఆ ప్రాజెక్టుకు బాధ్యుడైన సూపరింటెండింగ్ ఇంజనీరు స్వహస్తాలతో ప్రభుత్వానికి వ్రాసిన జాబునే తమ తరపున రుజువుగా చూపించారు వారు.

ఇదేమీ ఆషామాషీ విషయం కాదు. ఒక్క ప్రాజెక్టులో 400 కోట్ల మేర ధన దుర్వినియోగం జరిగినట్లు అధికారిక పత్రాలతో వెల్లడైంది. ఆ లెక్కన ఒక్కొక్క ప్రాజెక్టులో ఎన్నేసి వందల కోట్ల రూపాయలు హారతి కర్పూరమై పోతున్నాయో అన్న ఆందోళన ప్రజలలో కల్గడం సహజం. ఇంత తీవ్ర స్థాయిలో, నిజానికి దగ్గరగా ఆరోపణ వచ్చినప్పుడు ప్రభుత్వం చేయవలసిన బాధ్యత తమ వైపు నుంచి తప్పు జరగలేదు అని నిరూపించుకోవడం; ప్రజలలో నమ్మకం కల్గించడం. కానీ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఆ ప్రయత్నం చేయలేదు. తెలుగుదేశం వాదులు చూపిస్తున్నవన్నీ తప్పుడు పత్రాలనీ, వాటిని ఫోర్జరీ చేశారని, జాబు వ్రాశాడని చెప్తున్న సూపరింటెండింగ్ ఇంజనీరుకు మతిస్థిమితం లేదని, అడ్డగోలు వాదన మొదలు పెట్టింది. చివరి వరకు దానిపైనే నిలబడింది. ఈ వివాదంపై ఏదో ఒక నిర్ణయం తీసుకుని, చర్చ ముగియకుండా 16 రోజుల పాటు ఒక పథకం ప్రకారం కాలయాపన చేసింది. ఈ వివాదంలో తెలుగుదేశం, తతిమా ప్రతిపక్షాలు చాలా ఆరోపణలు చేశాయి కాబట్టి, విస్తృతంగా సమాచారం బయట పడింది కాబట్టి, ఈ ఒక్క అంశంపై మాత్రమే చర్చ పరిమితమయ్యేటట్లు చూస్తే, తతిమా ప్రాజెక్టు అవినీతి ఆరోపణలు చర్చకు రాకుండా పోతాయి అన్నది ప్రభుత్వ వుద్దేశం అట. తమ తప్పుడు ఎత్తుగడను సగర్వంగా చాటుకున్నారు సిఎల్పీ ప్రతినిధులు. ఇంత కంటే సిగ్గు మాలిన విషయం, ఇంత కంటే బరి తెగింపు వ్యవహారం వేరొకటి వుండదు.

**జమీన్‌రైతు**

జలయజ్ఞం కచ్చితంగా రాష్ట్రానికి మహోపకారం చేసే కార్యక్రమం. అందులో ఎవరికీ సందేహాలు లేవు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురైన నీటి పారుదల రంగానికి మోక్షం కల్పించి, రాష్ట్రంలో వున్న అపార జలవనరులను సద్వినియోగం చేసుకుని, నీటి కరవు అన్న మాట విన్పడకుండా చేసి, రైతాంగం జీవన ప్రమాణాలు పెంచే మహత్తర పథకం ఇది. ఒక్కసారిగా 60 నుంచి 70 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించడం అంటే మరొక భగీరథ ప్రయత్నంగానే పరిగణించాలి. ఇంతటి మంచి కార్యక్రమం భుజాల కెత్తుకున్న ముఖ్యమంత్రికి అన్ని వర్గాలు, అన్ని పార్టీలకు చెందిన వారూ సహకారం అందించాలనడంలో ద్వంద్వ అభిప్రాయాలు లేవు.

అయితే రాష్ట్రానికి మేలు జరుగుతున్నది కదా అనే నెపంతో ఆ కార్యక్రమాన్ని అవినీతి జలగలు పీల్చి పిప్పి చేస్తున్నా చూస్తూ వూరకుండి పోవాలనడం మాత్రం సమర్థనీయం కాదు, సమంజసమూ కాదు. అవినీతి ఆరోపణలపై విచారణలు, దర్యాప్తులు ప్రారంభమైతే అధికారుల మనోస్థైర్యం దెబ్బతిని జలయజ్ఞం అనుకున్నంత సాఫీగా సాగదు అన్నది కూడా పిడి వాదనే. ఒక మంచి జరిగే చోట ఒక చెడును కూడా అనుమతించాలని కోరడం సిగ్గులేనితనం. ప్రాజెక్టు నిర్మాణాలలో నమ్మదగిన ఆధారాలతో అవినీతి బయట పడినప్పుడు, అందుకు బాధ్యులెవరో తేల్చి, కఠినంగా శిక్షించడం ప్రభుత్వ కర్తవ్యం. అంతే తప్ప, అవినీతికి అధికార ముద్ర వేయజూడడం నేరం అవుతుంది. ఎల్లంపల్లిలో అంచనాలు పెరిగాయన్నది వాస్తవం. అదనంగా ఆయకట్టును చేర్చడం వల్ల, స్టీల్ వినియోగం పెరగడం వల్ల అంచనా పెంచవలసి వచ్చిందన్నది ప్రభుత్వ వాదన. అది నిజమైతే, అందుకు సంబంధించిన ఫైళ్ల ప్రతిపక్షానికి చూపించి తమ నిజాయితీ ప్రదర్శించుకోవడానికి ప్రభుత్వానికి అభ్యంతరం ఎందుకు? 16 రోజుల పాటు శాసనసభలో అంత చర్చ ఎందుకు? నానా రభసా జరిగిన తర్వాత, ఫైళ్లను సంబంధిత మంత్రి వద్ద పెడుతున్నామని, కావలసి వుంటే వచ్చి చూసుకోవచ్చు అని ప్రకటించారు ముఖ్యమంత్రి. కానీ మంత్రి అనేవాడు ఆరోపణ వచ్చిన అవినీతికి బాధ్యుడు. నిందితుడు చూపించే ఆధారాలను మాత్రమే నమ్మాలని చెప్పడం బహిరంగంగా దొంగతనాన్ని సమర్థించడం అవుతుంది. ఫైళ్లు పెట్టాలి అన్న నిర్ణయం తీసుకున్న తర్వాత, సందేహాలకు తావు లేకుండా స్పీకర్ గదిలోనే పెట్టి వుంటే, ప్రభుత్వ నిజాయితీ నమ్మదగి వుండేది.

ఏది ఏమైనా ఎల్లంపల్లి విషయంలో ప్రభుత్వం తీరు బాగా లేదు. అవినీతిని సమర్థించే తీరులో వ్యవహరించడం ప్రజా క్షేమానికి వుపకరించే పోకడ కాదు.

## 50 ఏళ్ల క్రితం నాటి జమీన్‌రైతు

23-3-1956

పేజీలు: 12 వెల:0-2-0

### గోపాలరెడ్డి రాజకీయాల నుంచి విరమించరు

15వతేది రాత్రి నెల్లూరు రోటరీ క్లబ్బు విందు సందర్భంలో, ముఖ్యమంత్రి డాక్టర్ గోపాలరెడ్డి గారు గావించిన వుపన్యాసంలో, వారి రాజకీయ భావిపై వెలిబుచ్చిన అభిప్రాయాల భాగం పత్రికలలో తప్పుగా ప్రకటించబడింది.

17వతేది 'ఆంధ్రప్రభ'లో యిలా వుంది.

"రాష్ట్ర పార్లమెంటరీ రాజకీయాల నుంచి విరమించడానికి తాము సంకల్పించుకొన్నట్టు ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి గారు నిన్న రాత్రి ఇక్కడ సూచించారు".

18.3.1956వతేది 'ఆంధ్ర పత్రిక'లో అదే భాగం ఈ విధంగా వున్నది.

"రాష్ట్ర రాజకీయాలు ప్రస్తావిస్తూ – వీటితో నాకు విసుగొస్తున్నది. సాధ్యమైనంత త్వరలో బయట పడదామనుకుంటున్నాను. ముఖ్యమంత్రి పదవి హంస తూలికా తల్పం గాదు. చాలా పెద్ద బాధ్యతలతో కూడినది. కనుక సుఖం కోరు వారెవ్వరూ దీనిని ఆశించవద్దు".

ఇవి రెండు సరిగాదు. గోపాలరెడ్డి గారు ఆ విధంగా చెప్పలేదు. యిందులో ఒక విలేకరి అసలు ఆ సమావేశానికి రాలేదు. గోపాలరెడ్డి గారి వుపన్యాసం వినలేదు.

రోటరీక్లబ్ ఛైర్మన్, గోపాలరెడ్డి గారు విశాలాంధ్ర ప్రథమ ముఖ్యమంత్రి కాగలరని జోస్యం చెప్పగా, దానిమీద ఈ ప్రస్తావనంతా వచ్చింది. రాజకీయాలలో ఏదీ యిదమిద్ధమని నిశ్చయంగా చెప్పడానికి లేదంటూ గోపాలరెడ్డి గారు గతంలో తన స్వంత అనుభవాన్ని వివరించారు. రాజకీయాలలో మున్ముందు ఏమి జరిగేది చెప్పలేమన్నారు. 1937లో మద్రాసుకు చేరే వరకు తాను మంత్రినౌతానని తనకు తెలియనే తెలియదని, 1952లో తాను ఓడిపోతాననేది వూహించలేదని వుదహరించడంలో గోపాలరెడ్డి గారి అభిప్రాయం అదే. మద్రాసులో రాజాజీ ప్రభుత్వం రెండు సంవత్సరాలు మాత్రమే వుంటుందనిగాని, ఆంధ్రలో ప్రకాశంగారి మంత్రివర్గం పదమూడు మాసాలలో పతనమౌతుందని గాని ఎవ్వరూ వూహించలేదని చెప్పడంలో గూడా గోపాలరెడ్డి గారి అభిప్రాయం అదే. అందువల్ల విశాలాంధ్ర ముఖ్యమంత్రిత్వం విషయం గూడా యిప్పుడే ఏమి చెప్పలేమనేది వారి వుద్దేశం.

అయితే ముఖ్యమంత్రిత్వం పన్నీరు పూల పాన్పు గాదని వెలిబుచ్చారు. తాను మంత్రిగా లేని మూడు సంవత్సరాలు ఎంతో విశ్రాంతిననుభవించానని, జైలు తర్వాత, సాహిత్య కృషికి తనకు ఆ సమయంలోనే అవకాశం కలిగిందని గోపాలరెడ్డి గారన్నారు. పన్నెండు మాసాల ముఖ్యమంత్రిత్వం తనకెంతో భారంగా వుండిందంటూ, దీనివల్ల పత్రికలు చదవడానికి కూడా వ్యవధి వుండదని, మిత్రులతో, బంధువులతో కలిసి మెలిసి వుండుటకు సమయం చిక్కదని వారు వెలిబుచ్చారు. అందువల్లనే అది (ముఖ్యమంత్రిత్వం) ఆకర్షణీయంగా లేదన్నారు.

### నెల్లూరు ముచ్చట్లు
### రూ.1500ల గడియారం దొరికింది

సుందరభవన్ యజమాని గద్దం సుందరరామిరెడ్డి గారు నెల రోజుల

తరువాత 10వ పేజీలో

# రిజర్వేషన్లు పునఃసమీక్షించాలి

బిసిల రిజర్వేషన్ విధానంలో క్రిమిలేయర్ పద్ధతి పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడం ముదావహం. బిసిల్లోనే గాక ఎస్సీ, ఎస్టీ కులాల రిజర్వేషన్‌లో కూడా క్రిమిలేయర్ పద్ధతి అమలు చేయాలి. అదేవిధంగా అగ్ర వర్గాలుగా పిలుస్తున్న కులాలలో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించాలి. ఈ విషయాలపై అన్ని రాజకీయ పక్షాలు కూర్చొని చర్చించడం అవసరం. రిజర్వేషన్లు అందుబాటులోకి వచ్చి 50 ఏళ్లు అయ్యాయి. దీన్ని సమీక్షించే దమ్ము రాజకీయ పక్షాలకు లేకపోవడం బాధాకరం.

*నెల్లూరు — షేక్ బషీర్*

### ఎయిడ్స్ రోగులను ఆదుకోండి

దేశ ప్రజల పాలిట ఎయిడ్స్ మహమ్మారిగా మారింది. చిన్న చిన్న ర్యాలీలు, వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు అతికించడం ద్వారా వ్యాధిని అరికట్టలేం. ప్రభుత్వం వద్ద ఇప్పటికీ వ్యాధి నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళిక లేదు. దీనివల్ల ఎయిడ్స్ రోగులను దేశంలోని వధాన్యులు ఆదుకోవాలి. పారిశ్రామిక వేత్తలు, ధనవంతులు, ప్రభుత్వాధికారులు, ఎన్జీఓలు తమ వంతుగా కొంత మొత్తం స్వచ్ఛందంగా విరాళమిస్తే తప్ప ఎయిడ్స్ బాధితుల జీవితాల్లో వెలుగులు ప్రసరించవు. దీనికోసం ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందిస్తే బాగుంటుంది.

*కొడవలూరు — డాక్టర్ కె. పెంచలయ్య*

### ఈ ఖర్చు మోయలేని భారమే!

ప్రధాని, మాజీ ప్రధానులు వారి కుటుంబ సభ్యుల రక్షణ కోసం కేంద్ర బడ్జెట్‌లో 125 కోట్లు కేటాయించడం ఎవరూ పట్టించుకోలేదు. ఇదిగాక కేంద్ర మంత్రులు, ఎమ్పీల రక్షణకు ఎన్ని వందల కోట్లు ఖర్చవుతుందో విడిగా చూపలేదు. రాష్ట్రంలో అయితే ఎమ్మెల్యేలు, మంత్రుల గన్‌మెన్లకు 60 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దేశం మొత్తం ప్రజా ప్రతినిధుల రక్షణకు దరిదాపులు 6,500 కోట్లు ఖర్చు పెడుతూ నాయకులుగా చలామణి అవడం చూస్తే జాలి కల్గుతుంది.

*కావలి — ఎస్. లక్ష్మీ ప్రసూన*

### ముందు మీరు ఏకంకండి

సిపిఎం, సిపిఐ పార్టీలు ప్రపంచ కార్మికులారా... ఏకంకండి అంటూ నినదిస్తుంటాయి. కాని ఈ రెండు పార్టీలు మాత్రం వేర్వేరు త్రోవల్లో నడుస్తుంటాయి.

## జనవాణి

రాష్ట్రంలో ఈ మధ్య ఈ రెండు పార్టీలకు పొడగిట్టడం లేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుంటే, సిపిఐ మద్దతు ఇస్తుంది. ఈ వ్యవహారంలో సిపిఐ వైఖరిని సిపిఎం రాష్ట్ర శాఖ కార్యదర్శి విమర్శిస్తే, సిపిఐ తాము ప్రజలకు జవాబుదారీ కాని, సిపిఎంకు కాదని ఎత్తి పొడిచింది. సిపిఎం, సిపిఐ కలిసి ప్రజా వుద్యమాలు నిర్మిస్తే బాగుంటుంది.

*నెల్లూరు — పి.సుధీర్*

### శృంగారం పరువు - ప్రతిష్టలు

తరచుగా శృంగార మాధుర్యాన్ని పొందడం అన్ని విధాలా ఆరోగ్య దాయకమనేందుకు నిష్పాక్షికమైన ఆధారాలు ఇటీవలే పదే పదే వెలువడుతున్నాయి. దురదృష్టవశాత్తు కొందరు శృంగార మాధుర్యాన్ని పొందలేరు. శృంగారాంశాల పట్ల సమాజంలో నాటుకు పోయి వున్న కొన్ని అర్థం పర్థం లేని పోకడలు శృంగారంలో వైఫల్యాలకు ప్రధాన కారణం. సెక్సాలజిస్టను సంప్రదిస్తే కౌన్సెలింగ్ ద్వారా శృంగార మాధుర్యాన్ని పెంపొందించుకునే అవకాశమేర్పడుతుంది. కానీ సెక్సాలజిస్టను సంప్రదించడం పరువు ప్రతిష్టలకు భంగకరమని చాలామంది భావిస్తారు. ఒక ప్రధానాంశాన్ని పరిశీలిస్తే అటువంటి ధోరణి కరెక్టు కాదని విశదమవుతుంది.

తరువాత 10వ పేజీలో




LG 2340

ఏంది!
మరీ ఇంత తక్కువ ధరా?
ఔను
రూ. 1499/- లకే
ఒక సంవత్సరం వారంటీ కార్డుతో లభించును.
ఈ అవకాశం ఇంకెప్పుడూ రాదేమో?
ఈ రోజే ఈ సెల్ ఫోన్‌ను మీ సొంతం చేసుకోండి.
Reliance IndiaPhone

బాలాజి వాచ్ & ఎలక్ట్రానిక్స్ — ఫోన్: 2321123
బాలాజి ప్లాజా — నర్తకి థియేటర్ ఎదురుగా, నెల్లూరు. ఫోన్ : 2332178
బాలాజి మొబైల్స్ — BSNL కార్యాలయం ప్రక్కన, నెల్లూరు. సెల్ : 93469 88990

## నెల్లూరు సంగతులు

# చెత్త కుప్పల్లో బంగారం

నెల్లూరు నగర ప్రజలను చీకాకు పరుస్తున్న చెత్త సమస్యకు పరిష్కారం దొరకనుంది. ఈ చెత్త మూలంగా కార్పొరేషన్ ఆదాయం కూడా పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకు నగరంలో చెత్త తొలగింపుకు కార్పొరేషన్ కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నా అక్కడి చెత్త అక్కడే వుండి జనాన్ని చీకాకు పరుస్తుంది. కాని ఈ చెత్త నుంచి విద్యుత్‌తో పాటు మేలైన ఎరువుల తయారీకి రెండు సంస్థలు దరఖాస్తు చేశాయి. ఈ విషయమై కార్పొరేషన్ ప్రభుత్వ

### 'కార్పొ' ఆదాయం పెరిగే అవకాశం

అనుమతికి ప్రతిపాదనలు పంపింది. నగరంలో ప్రతినిత్యం 300 టన్నుల మేర చెత్త పడుతుంది. ఈ చెత్తతో బ్రహ్మాండంగా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వద్ద ఫైళ్లలో పెండింగ్‌లో వుండిపోకుండా వెనువెంటనే నిర్ణయం తీసుకొనేలా ఎమ్మెల్యే వివేకానందరెడ్డి కృషి చేస్తే బాగుంటుంది. మొత్తం మీద ఈ కొత్త ప్రతిపాదనలను ప్రభుత్వం ఒప్పుకొంటే కార్పొరేషన్ ఇప్పటి వరకు చెత్త తొలగింపుకు వినియోగిస్తున్న మొత్తం కూడా తగ్గే అవకాశముంది.

# మొబైల్ వ్యభిచారం

నెల్లూరీయులు కొత్త వ్యవహారాలను అనుసరించడంలో ముందుంటారు. నగరంలో ఇటీవల వ్యభిచార గృహాలపై దాడులు జరుగుతుండడంతో వీటి నిర్వాహకులు కొత్త మార్గం ఎంచుకొన్నారు. ఈ మార్గమే విహారయాత్ర ముసుగులో హైటెక్ వ్యభిచారాన్ని కొనసాగించడం. వేసవి స్పెషల్ యాత్రలని కొందరు వ్యభి

### యాత్రా స్పెషల్ పేరిట...

చార గృహ నిర్వాహకులు మూడు నుంచి నాలుగు రోజుల విహారయాత్రలను చెన్నై, బెంగుళూరు, ఊటీ, విశాఖపట్నం ప్రాంతాలకు ప్లాన్ చేస్తున్నారు. పన్నెండు వేల రూపాయలు పుచ్చుకొని 12 మంది కూర్చొనే వసతి వున్న మినీ వ్యాన్లలో

తొరవ 11వ పేజీలో



స్వర్గీయ ఎసి సుబ్బారెడ్డి శత జయంతోత్సవం సందర్భంగా ఎసి సెంటర్‌లోని విగ్రహానికి పూల మాల వేస్తున్న ఆయన మనవడు ఆనం వెంకటరమణారెడ్డి

# త్రాగుడు పెరిగినా రాని రాబడి

జిల్లాలో తాగుడు ఎక్కువైన దానికి తగినట్లుగా ఎక్సైజ్ శాఖకు ఆదాయం పెరగక పోవడం చర్చనీయాంశమయ్యింది. నాన్ పెయిడ్ డ్యూటీ లిక్కర్ అమ్మకం విచ్చలవిడి కావడం వల్ల ఈ దుస్థితి దాపురించింది. ఎక్సైజ్ సిబ్బంది నాన్ పెయిడ్ డ్యూటీ లిక్కర్ అమ్మకాలు ఆపాల్సింది పోయి, షాపుల నిర్వాహకుల వద్ద లంచాలు తీసుకొని ఊరుకొంటుండడం వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుంది. 144 మద్యం షాపులున్న సమయంలో జిల్లాలో సంవత్సరానికి 90 కోట్ల రూపాయల మద్యం అమ్ముడయ్యేది. ఇప్పుడు బ్రాందీ షాపులు, బార్లు కలిసి నాలుగు వందలయినా మద్యం అమ్మకం మాత్రం 90కోట్ల రూపాయలను మించడం లేదు. వాస్తవానికి జిల్లాలోని బ్రాందీషాపుల నిర్వాహకులు దేవరకొండలోని ఎపి బేవరేజస్ కార్పొరేషన్ డిపో నుంచి అక్కడ స్టాకుండే 50 రకాల మద్యం కొనుగోలు చేయాలి. కాని బ్రాందీషాపుల నిర్వాహకులు లక్ష కేసుల వరకు వివిధ బ్రాండ్ల మద్యాన్ని ప్రక్క రాష్ట్రాల నుంచి అక్రమ మార్గంలో దిగుమతి చేసుకొని అమ్మకాలు చేసుకొంటూ కోటీశ్వరులవుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి చౌక ధరలకు దిగుమతి చేసుకొంటున్న ఎన్‌డిపి లిక్కర్ వ్యాపారులకు రెట్టింపు లాభాలు తెచ్చి పెడుతుంది. మద్యం

### నాన్ పెయిడ్ డ్యూటీ మద్యమే కారణం?

వ్యాపారులు సిండికేట్ అయ్యి నాన్ పెయిడ్ డ్యూటీ లిక్కర్‌ను పథకం ప్రకారం జిల్లాకు తెచ్చుకొని షాపు షాపుకు సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో ప్రస్తుతం అమ్ముడవుతున్న మద్యం 150 కోట్ల రూపాయలుగా అంచనా. దరిదాపులు 60 కోట్ల రూపాయల మద్యం అమ్మకం వల్ల వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోవడానికి ఎక్సైజ్ శాఖ సహకరించడం కంచే చేను మేసిన సామెతను గుర్తుకు తెస్తుంది.

# క్లబ్బులపై లాఠీ వేటు

నెల్లూరు నగరంలోని క్లబ్బులపై పోలీసులు లాఠీ ఝుళిపించారు. దీంతో ఇక్కడ ఇష్టానుసారం తాగడంతో పాటు పేకాట ఆడుతున్న పెద్ద మనుషులు గతవారం తలోదారి పరుగెత్తిన విషయం నగరంలో చర్చనీయాంశమయ్యింది. నగరంలోని ఆఫీసర్ క్లబ్, మెక్లిన్స్ క్లబ్, నెల్లూరు క్లబ్, ఎన్జీఓ క్లబ్బులలో కొత్త ఎస్పీ సూర్యనారాయణ బాధ్యతల స్వీకరణ ముందు వరకు మద్యం, పేకాట జోరుగు సాగుతుండేది. క్లబ్బులలో సాగే క్రీడలు, గ్రంథా

### నేతల సహాయం కోరనున్న నిర్వాహకులు

లయాల మూలంగా లాభముండదు. దీనివల్లే నిర్వాహకులు మద్యం,.పేకాటను ప్రోత్సహిస్తారు. వాస్తవానికి క్లబ్బులు ఉదయం 9 గంటలకు తెరచి రాత్రి 10 గంటలకు మూసివేయాలి. కాని నగరంలో నడుస్తున్న నాలుగు క్లబ్బులలో రాత్రి రెండు గంటల వరకు మద్యం, పేకాట సాగుతుంది. మందెక్కువైన వారు ఇక్కడే శయనించి, మత్తు తగ్గాక ఉదయం ఇళ్లకు చేరడం అలవాటయ్యింది. నెల్లూరులో నాలుగు క్లబ్బులున్నా, రెండు క్లబ్బులలోనే

తొరవ 11వ పేజీలో

# వసూల్ రాజానా... మజాకానా

తడ చెక్‌పోస్ట్‌లో రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ, తన అవినీతి అడ్డు తగలకుండా ఎసిబి డిఎస్పీకే ఒక బ్రోకర్ ద్వారా నెలకు లక్ష రూపాయలు లంచమివ్వ చూపి, పట్టుబడిన రమణ్ నాయక్‌కు మూడు నెలలు తిరగక ముందే ఇక్కడ పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశమయ్యింది. సహజంగా అవినీతికి

### లంచగొండి అధికారికి పాత చోటే పోస్టింగ్

పాల్పడుతూ ఎసిబికి చిక్కిన అధికారికి సంవత్సరం పాటు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వరు. ఇచ్చినా సుదూర ప్రాంతాల్లో ఇస్తారు. వాస్తవానికి ఈ పోస్టింగ్ పనిష్‌మెంట్‌లా కొనసాగుతుంది. అయితే రమణ్‌నాయక్ గతంలో అవినీతికి పాల్పడుతూ ఎసిబి

తొరవ 11వ పేజీలో

# మత సామరస్యానికి మచ్చ

బయటి ప్రాంతాల్లో ఎన్ని మత కల్లోలాలు జరిగినా నెల్లూరు నగరంలో మాత్రం మత సామరస్యం ఫరిడవిల్లుతుంది. ఎప్పుడో 50 ఏళ్ల క్రితం మినహా నెల్లూరులో మత ఘర్షణల ఊసే లేదు. అటువంటిది 19తేది నెల్లూరు పప్పులవీధి ప్రాంతంలో ఏసుక్రీస్తు స్తోత్ర కీర్తనలు పాడుతూ సాగుతుండిన బృందంపై ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు దాడి చేసిన విషయం నగరంలో ఉద్రిక్తతకు దారి తీసింది. ఆదివారం నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఏసుక్రీస్తు స్తోత్ర కీర్తనలు పాడడం సహజమే. 19తేది పప్పులవీధిలోని మహాలక్ష్మి దేవాలయం వద్ద పెద్దగా పాటలు పాడుతున్నారని ఈ ప్రాంతంలోని ఐదారు మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు వీరిపై దాడికి దిగారు. ఈ విషయం దావానలంలా పాకడంతో నగరంలోని క్రైస్తవులంతా రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద గుమికూడి పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ దౌర్జన్యాలను అరికట్టాలంటూ నినాదాలు చేస్తూ కలెక్టర్, ఎస్పీల వద్దకు ప్రదర్శనగా వెళ్లి వినతి పత్రాలు ఇచ్చారు. ఎస్పీ ఈ దాడికి కారకులైన వారిని అదుపులోకి తీసుకోమని

తొరవ 11వ పేజీలో

# కాపురాలు కూలుస్తున్న ఆకాశరామన్నలు

మహిళలను వేధించడంలో నెల్లూరు యువకులు సరికొత్తదారులు వెతికారు. కొత్తగా పెళ్లయిన జంటలకు ఆకాశరామన్న అవతారం ఎత్తి వ్రాస్తున్న ఉత్తరాలతో ఆ కుటుంబాలు కుప్పకూలి పోతున్నాయి. ఈ వ్యవహారం బయటకు చెప్పుకోలేనిది కావడంతో మహిళలు లోలోపల కుంగిపోతున్నారు. ఇటువంటి ఉత్తరాల మూలంగానే రెండు వారాల క్రిందట షమీమ్ అనే మహిళ సుందరయ్య కాలనీలో ఆత్మహత్య చేసుకొంది. మూలాపేటలో కొత్తగా పెళ్లయిన దంపతులకు ఇటువంటి ఉత్తరం వ్రాయడంతో ఈ కుటుంబంలో కలతలు రేగాయి. బాలాజీ నగర్‌కు చెందిన శ్రీవాణి అనే మహిళకు ఇటువంటి ఉత్తరం రావడంతో ఆమె భర్త అనుమానించాడు. దీన్ని భరించలేక ఆమె గత మంగళవారం ఆత్మహత్య చేసుకొంది. కొందరు ఆకతాయిలు డ్యూటీలు, కాలేజీలు, కోచింగ్ సెంటర్లకు వెళ్తున్న మహిళలను అనుసరిస్తూ వెళ్తూ వారిని ఇక్కట్ల పాలు చేస్తున్నారు. ఆత్మకూరు బస్టాండ్, పద్మావతిసెంటర్, విఆర్, డికెడబ్ల్యు కాలేజీలు, బాలాజీనగర్, నవాబుపేట, చిల్డ్రన్స్ పార్కు ప్రాంతాల్లో మహిళలను వేధించే ఆకతాయిలు ఎక్కువయ్యారు. ఇష్టమొచ్చిన నెంబర్లకు ఫోన్ చేసి మహిళలు ఫోన్ ఎత్తితే నోటికొచ్చినట్లు మాట్లాడే వాళ్లు బయలు దేరారు. పోలీస్‌స్టేషన్లలో సైతం లేడీ కానిస్టేబుళ్లను పురుష కానిస్టేబుళ్లు టీజ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారాలకు ఫుల్‌స్టాప్ పెట్టించే దిశగా ఎస్పీ కార్యాచరణను

### ప్రాణాలు తీసుకొన్న అభిమానవతులు

రూపొందించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

### జక్కా రంగారెడ్డి స్మారక నాటకాలు

నెల్లూరులోని జక్కా రంగారెడ్డి స్మారక కళాపీఠం నేతృత్వంలో నాటక త్రయ సంబరాలు ఈనెల 29, 30, 31 తేదీల్లో జరుగుతాయి. 29తేది ఈ సంబరాలను టౌన్‌హాల్‌లో జెకెరెడ్డి ప్రారంభిస్తారు. అనంతరం సతీసావిత్రి నాటక ప్రదర్శన వుంటుంది. 30తేది సాయంత్రం వేమూరు రామమూర్తి శర్మ ఉగాది పంచాంగ శ్రవణానంతరం, భక్త రామదాసు నాటక ప్రదర్శన వుంటుంది. 31తేది పాండవోద్యోగం నాటకాన్ని ప్రదర్శిస్తారు. పారిశ్రామిక వేత్త, జెఎన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకరరెడ్డి ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారు. నాటకాభిమానులందరినీ ఈ కార్యక్రమాలకు తరలి రమ్మంటున్నాడు జక్కా రంగారెడ్డి స్మారక కళాపీఠం కార్యదర్శి పొన్నాల రామ సుబ్బారెడ్డి.

### రైతు చైతన్యయాత్రలు విజయవంతం చేయండి

రాష్ట్ర ప్రభుత్వం వినూత్న రీతిలో చేపట్టిన రైతు చైతన్య యాత్రలు విజయవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టరు ఎం.రవిచంద్ర వ్యవసాయాధికారులను ఆదేశించారు. 23తేది కలెక్టరేట్‌లోని గోల్డన్ జూబ్లీ హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి వ్యవసాయ, దాని అనుబంధ శాఖల

తొరవ 11వ పేజీలో

# నమ్మక ద్రోహం

మనిషి మరొకడిని నమ్మితే చాలు. వెనువెంటనే ద్రోహానికి గురికాక తప్పని రోజులివి. నెల్లూరు మండపాల వీధికి చెందిన బంగారు రూట్ బిజినెస్ చేసే మెంటా సురేష్‌బాబు, స్నేహితుని నమ్మడంలో అతను బిరియానిలో సైనేడ్ కలిపి పెట్టి ప్రాణం తీశాడు. అతని వద్ద వుండిన లక్షన్నర రూపాయల విలువ చేసే బంగారు నగలను నొక్కేశాడు. కాలం కలిసిరాక పోలీసుల చేతికి చిక్కి ప్రస్తుతం కటకటాలు లెక్క బెడుతున్నాడు. ఈ ఘాతుకం పూర్వాపరాల్లోకి వెళ్తే: మెంటా సురేష్ గత కొన్నేళ్లుగా నెల్లూరులో బంగారు నగలు చేసుకొని నర్సారావుపేట, ఫిరంగిపురం, సత్తెనపల్లి ప్రాంతాల్లోని బంగారు షాపులను ఆర్డర్ల మీద తీసుకెళ్లి ఇచ్చేవాడు. నెలకు రెండు మూడు సార్లు ఈ రూట్‌కు వెళ్లి బిజినెస్ చేసేవాడు. 9తేది వ్యాపారంలో భాగంగా ఒకటిన్నర లక్షల రూపాయలు విలువ చేసే నగలతో ఫిరంగిపురం వెళ్లాడు. ఈ పట్టణంలో మల్లికార్జున అనే బంగారు వ్యాపారి సురేష్‌తో మిత్రునిగా మెలిగేవాడు. ఎప్పుడు ఇక్కడకు వెళ్లినా సురేష్, మల్లికార్జునతో కలిసి భోంచేసేవాడు. ఈ అవకాశాన్ని మల్లికార్జున తనకు అనుకూ

తొరవ 11వ పేజీలో

## జిల్లా వార్తలు

# అల్లూరులో గంజాయి దమ్ము

అల్లూరు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో పబ్లిక్‌గా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. బస్టాండ్ సెంటర్ నుంచి నిత్యం వందలాది మంది ప్రజలు పయనిస్తుంటారు. ఇక్కడి టెంట్‌లో విక్రయించే గంజాయిని తాగిన వ్యక్తులు బస్సుల కోసం వేచి వుండే మహిళలను ఇబ్బంది పెడుతున్నారు. ఈ వ్యవహారం

**బస్టాండ్‌లోనే బహిరంగ విక్రయం**

పోలీసులకు తెలిసినా చూసీ చూడనట్లు వుండడం విమర్శలకు దారితీస్తుంది.

### ప్రాణం కాపాడిన విష్ణు

కళ్ల ముందే మనిషి ప్రాణాలు పోతున్నా పట్టించుకోని పాపిష్టి కాలం ఇది. అల్లూరు వెంకన్నగుంట ప్రాంతంలో గతవారం రోజులుగా దిక్కు, మొక్కు లేని అనాధ కొన ఊపిరితో రోడ్డు ప్రక్కనే పడి వున్నా పట్టించుకొన్న వారే లేరు. 19తేది ఈ ప్రాంతంలో రేషన్‌కార్డుల పరిశీలనకు అల్లూరు ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

తరువ 7వ పేజీలో

# బహిరంగ రచ్చకు సిద్ధం?

ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిలు తమ హయాంలో జరిగిన అభివృద్ధి, అవినీతి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు 'సై' అంటే 'సై' అంటున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి కనీసం పదిసార్లు కంభం బహిరంగ చర్చకు రావాలంటూ ఎమ్మెల్యే మేక

**బస్తీమే సవాళ్లతో మేకపాటి, కంభం**

పాటి చంద్రశేఖర్‌రెడ్డి పత్రికల ద్వారా కోరారు. కంభం విజయ రామిరెడ్డి తనను విమర్శించినప్పుడల్లా మేకపాటి చర్చకు రమ్మని పిలుస్తుంటారు. తెలుగుదేశం పార్టీ ఇటీవల నిర్వహించిన 'పల్లె పిలుపు' కార్యక్రమంలో భాగంగా నియోజక వర్గంలో విస్తృతంగా తిరిగిన కంభం విజయరామిరెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించడంతో ఇక్కడి రాజకీయాల్లో వేడి పుట్టింది. ఈ సవాల్‌ను

తరువ 8వ పేజీలో




వెంకటాచలం సత్రంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో నారాయణ మెడికల్ కాలేజి నేతృత్వంలో నడిచే గ్రామీణ వైద్యశాలను ప్రారంభించి మాట్లాడుతున్న బిజెపి అగ్రనేత వెంకయ్యనాయుడు. వేదికపై డాక్టర్లు శివకుమార్, రాజన్న, విజయకుమార్, దీపా వున్నారు.

# నీటికోసం పోరాటం

నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన యోధాన యోధులు 19తేది ఉదయగిరి నియోజక వర్గంలోని దుత్తలూరు మండలం నర్రవాడలో వున్న వెంగమాంబ పేరంటాలు సన్నిధిలో కొలువు దీరారు. జై ఆంధ్ర ఉద్యమ రూపకర్త, మాజీమంత్రి మాదాల జానకిరాం ఈ కార్యక్రమ నిర్వహణ సమస్తం భుజాన వేసుకొని ముందుకు నడిపారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వున్న ఉదయగిరి, కనిగిరి, కంభం, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, పొదిలి ప్రాంతాల ప్రజలు గత పాలకుల చారిత్రక తప్పిదాల వల్ల సాగునీటికి, తాగునీటికి నోచుకోక దురవస్థ నెదుర్కొంటున్నారంటూ ఏక కంఠంతో ఆవేదన చెందారు. నాగార్జున సాగర్, వెలుగొండ ప్రాజెక్టు కుడి కాలువల సాధన వల్లే ఇక్కడి దుర్భిక్షం రూపుమాపే వీలుందని తీర్మానించారు. అయితే వివిధ రాజకీయ పక్షాలు, రైతు సంఘాల నేతలు ఒక్కచోటికి చేరటంతో జన్మత: తమకు అబ్బిన విద్యలు ప్రదర్శించేందుకు ఎవరికివారు ఇతోధిక ప్రయత్నం చేశారు. కార్యక్రమ నిర్వాహకుడైన మాదాల జానకిరాం ప్రస్తుతం తెలుగు దేశం పార్టీ నేతగా చెలామణిలో వున్నారు. అయితే 1989లో తాను ఉదయగిరికి ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిని తీసుకొచ్చి రక్త తిలకం దిద్దిన వైనం సమావేశంలో అందరికీ గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో 85వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు నిర్మితమైతే, తన ఐదేళ్ల హయాంలో లక్ష కోట్ల వ్యయమయ్యే జలయజ్ఞానికి రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టి చరిత్ర పుటలకెక్కాడని చెప్పి తాను అంతర్గతంగా కాంగ్రెస్‌వాదిననిపించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనదైన శైలిలో గణాంకాల చిట్టా విప్పారు. లక్ష కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు సంవత్సరానికి 10వేల కోట్లు వడ్డీ అవుతుందని ఆ వడ్డీలో ఐదో వంతు అంటే 2వేల కోట్లు ఇస్తే తెలంగాణా కంటే ఘోరంగా వెనుక

**ఉదయగిరి నేతల ప్రతిన**

తరువ 8వ పేజీలో

# కోడూరులో దారుణ హత్య

తోటపల్లి గూడూరు మండలం కోడూరు గ్రామంలో వృద్ధురాలు చెన్నంరెడ్డి మీనమ్మ(80)ను ఈ గ్రామానికే చెందిన చిల్లర దొంగలు నెరునూరు నరేంద్ర, పల్లికొండ శివ హత్య చేశారు. ఆమె నుంచి ఆరు బంగారు గాజులు, ఉంగరం దోచుకొన్నారు. హతురాలు ఒంటరిగా వుండేది. భక్తి పారాయణ కార్యక్రమాలకు హాజరవుతూ కాలం గడిపేది. ఈమెకు ఎవరి అండలేదని తెలుసుకొన్న దొంగలు 16తేది రాత్రి ఇంటి చూరుగుండా ప్రవేశించి ఈ దారుణానికి ఒడిగట్టారు. తొలుత ఈమె బంధువర్గం ఈ హత్య పట్ల పెద్దగా శ్రద్ధ చూపక పోవడంతో గ్రామ యువకులు, మీడియా జోక్యంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. పోలీసు కుక్క స్పీటీ రావడం, నేరస్తులు దొరకడం చకచకా జరిగిపోయాయి. ఈ జులాయిలను గురించి తెలుసుకోవలసిన విషయాలు చాలా వున్నాయి. ఇందులో నెరునూరు నరేంద్ర అదుపు లేకుండా పెరిగాడు. తల్లితండ్రులను కొట్టడం, భార్యను

**నగల కోసం తెగబడ్డారు**

తరువ 8వ పేజీలో

# పంచాయతీ కార్యదర్శిపై వేటు

కావలి మండలం ఆర్‌సిపాళెం పంచాయతీ కార్యదర్శి బి.బుజ్జమ్మను అవినీతికి పాల్పడినట్లు నిరూపణ కావడంతో ఉద్యోగం నుంచి జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. బుజ్జమ్మ ప్రతి పని చేయను లంచం డిమాండ్ చేయడంలో నేర్పరట. ఈ విషయం కావలి ఎమ్మార్వో చేసిన విచారణలోనూ తేలింది. దీంతో ఈ చర్య తీసుకొన్నారు. పంచాయతీ కార్యదర్శులు అవినీతికి పాల్పడితే శిక్ష తప్పదంటున్నారు కలెక్టర్ గారు. తస్మాత్ జాగ్రత్త!

**కలెక్టర్ కరకు నిర్ణయం**

### ప్రజల దగ్గరకు వెళ్లండి

ప్రజలకు సన్నిహితంగా వుంటూ వారి అవసరాలు గుర్తించి ఆధునిక సౌకర్యాలను వివరించి సేవలందించక పోతే తపాలాఫీ

తరువ 7వ పేజీలో

# అల్లూరులో టీవీలకు విశ్రాంతి

ఇళ్లలో టీవి అతి ముఖ్యమైన వినోద సాధనమైన సంగతి అందరికీ తెలిసిందే. జనం లేచింది మొదలు నిద్రపోయే వరకు తమకిష్టమైన కార్యక్రమాలు చూడడం అలవాటు చేసుకొన్న కాలమిది. పరీక్షల కాలంలో టీవి చూడడం మూలంగా ఉత్తీర్ణత తగ్గి పోతుండడంతో అల్లూరు రామకృష్ణ జూనియర్ కాలేజి, హైస్కూల్ విభాగం అధ్యాపకులు సరికొత్త కార్యక్రమం మొదలెట్టారు. ఈ యేడు పదవ తరగతి పరీక్షలు వ్రాస్తున్న 370 మంది విద్యార్థినీ, విద్యార్థుల ఇళ్లకు హెడ్మాస్టర్ రాజేశ్వరరావు నేతృత్వంలో వెళ్లి పరీక్షలు జరిగినన్ని రోజులు పొరపాటున కూడా టీవి పెట్టవద్దని విద్యార్థుల తల్లితండ్రులకు నచ్చజెప్పారు. తమ బిడ్డల భవితవ్యం గూర్చి ఉపాధ్యాయుల ఆందోళన గుర్తెరిగి తల్లితండ్రులు గత మాసం రోజులుగా ఇళ్లలోని డిష్ కనెక్షన్లు తొలగించారు. దీనిమూలంగా ఉత్తీర్ణతా శాతం పెరుగుతుందని హెడ్మాస్టర్ చెబుతున్నారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి వివిధ సబ్జెక్టులలో పిల్లల సందేహాలు తీర్చడం కూడా ప్రశంసార్హమయ్యింది.

### అధికారుల పనితీరుపై మేకపాటి అసంతృప్తి

ఉదయగిరి నియోజక వర్గంలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నుంచి తాను పుష్కలంగా నిధులు సాధిస్తున్నా కింది స్థాయిలో పనులు చేయాల్సిన అధికారులు మాత్రం తమ విధులకు పంగనామాలు పెడుతున్నారంటూ ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. 19తేది మర్రిపాడులో ఎంపిపి కోనంకి సులోచన అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఇందిర ప్రభ పథకాన్ని నేను ఆ శాఖా మంత్రిని మర్రిపాడు మండలం నాగినేనిగుంటకు తీసుకొచ్చి ప్రారంభం చేయిస్తే దానితో సహా ఆ పథకానికి ఎంపికైన గ్రామాల్లో కనీస పురోభివృద్ధి కానరాదేమంటూ నిలదీశారు. గ్రామ కార్యదర్శులు వర్గాలు, రాజకీయాలు జోలికి పోకుండా ప్రభుత్వం చెప్పిన పనులు చేయాలని కోరారు. అధికారులు మారకపోతే దండోపాయానికి వెనకాడేది లేదని హెచ్చరించారు. ఉదయగిరి ప్రాంత అధికారులు సమాజంలో ఇంత చెడ్డపేరు ఎందుకు తెచ్చుకొంటున్నారో ఎవరికీ అర్థం కాదు. ఆ శాఖ, ఈ శాఖ అని కాకుండా అన్ని ప్రభుత్వ విభాగాలలోను ఇదే తంతు కొనసాగుతున్నది. జిల్లా కలెక్టర్ రవిచంద్ర, ఇందిర క్రాంతి పథకం పిడి విజయకుమార్‌లు కూడా ఇటీవల ఉదయగిరి పర్యటనలో ఇక్కడి అధికారులు చేతగాని వాళ్లనే అభిప్రాయం వ్యక్తపరిచారు. ఉన్నతాధికారులకే ఇంతటి జుగుప్స కలిగించిన ఇక్కడి ప్రభుత్వ సిబ్బంది ఇకనైనా తమ పనితీరు మార్చుకొంటే బాగుంటుంది.

**డిష్‌వైర్లను తీసేసిన జనం**

# పశువులు మాయం

కలువాయిలో పోలీసుల సాక్షిగా మండలంలోని పశు సంపద యావత్తు కబేళాలకు తరలి వెళ్తోంది. నోరులేని మూగ జీవాలు సాక్ష్యం చెప్పలేవన్న ధీమాతో మండలంలోని కొందరు వ్యక్తులు వీధుల్లో ఆరుబైట ఆదమరచి వున్న గేదెలను, ఆవులను తోలుకెళ్లి అమ్మేసుకొంటున్నారు. కొన్నింటిని దూర ప్రాంతాలకు తరలిస్తుంటే, మరికొన్నింటిని వధించి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ మాంసాన్ని ఇక్కడి నుంచి నెల్లూరుకు కూడా సరఫరా చేస్తున్నారు. మొన్నటి వరకు ఎప్పుడూ నడి బస్టాండ్‌లో గుంపులు గుంపులుగా దారికి అడ్డంగా తిష్టవేసి వుండే పశువులు నేడు మచ్చుకు ఒక్కటైనా కన్పించక పోవడం ఇక్కడి పశువుల దొంగతనాల తీవ్రతను తెలియజేస్తుంది. పశువులను పోగొట్టుకొన్న బాధితులు న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తే గాటిలో కట్టి వున్న పశువులు పోతే తప్ప, వీధుల్లో తిరిగే పశువులు పోతే తమకు ఫిర్యాదు చెయ్యవద్దంటూ ఏఎస్ఐ నుంచి సిఐ వరకు ఖరాఖండిగా చెప్పేస్తున్నారు. పోయిన పశువులను వెదికిపెట్టి న్యాయం చేయడం అటుంచి తానిచ్చిన ఫిర్యాదుకు రశీదు ఇవ్వండి సారూ... అంటూ మనమాల రఘురామిరెడ్డి అనే రైతు పోలీస్‌స్టేషన్ చుట్టూ పలుమార్లు తిరిగాడు. చివరకు ఎస్పీని కలిసినా కలువాయి పోలీసుల్లో కదలిక లేకపోవడం పట్ల బాధితుడు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాడు. రెండేళ్లుగా జరుగుతున్న పశు దొంగతనాలపై పోలీసులు చూపుతున్న నిర్లక్ష్యం పట్ల ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్ల క్రితం తెలుగురాయపురం వద్ద దొంగతనంగా పశువులను లారీలో తీసుకెళ్తుండగా రైతులు పట్టించిన కేసులో పలువురిని ఇంకా అరెస్ట్

**లబో దిబోమంటున్న కలువాయి రైతులు**

# నెల్లూరు ముఖ్యాంశాలు

## ఉత్తర కాలువకు నీళ్లు

సోమశిల ప్రాజెక్టు నుంచి ఈ సీజ న్‌లో పంటసాగుకు ఉత్తర కాలువకు నీరు విడుదల చేయాలని కావలి ఎమ్మెల్యే శ్రీమతి మాగుంట పార్వతమ్మ, కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. 22తేది ఉదయం అసెంబ్లీ ఆవరణంలో వారిద్దరూ కలిసి ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఇరిగేషన్ మంత్రి పొన్నాల లక్ష్మయ్యను కూడా కలిసి ఇదే అంశం అడిగారు. ఉత్తర కాలువకు నీరు ఇస్తే కావలి, వింజమూరు, కలిగిరి తదితర మండలాలలో చాలా గ్రామాలు ప్రయోజనం పొందుతాయి. వరద సమయంలో మొదటి పంటకు ఈ కాలువకు నీరు వదలడం సాంప్రదాయం. ఈసారి రెండవ పంటకు కూడా ఇచ్చేందుకు వీలుగా సోమశిలలో నీటి నిల్వ వుంది కాబట్టి, నెల్లూరు డెల్టాతో పాటుగా కావలికీ ఆ భాగ్యం కల్పించమని కోరారామె.

## ఆనం శిబిరంలో తిరుగుబాటు

జిల్లా ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి జరిపిన సమావేశానికి కొత్తగా తమ వద్దకు వచ్చి చేరిన చేవూరు దేవకుమార్‌రెడ్డిని వెంటబెట్టుకుని వెళ్లడం ఆనం సోదరులకు లేనిపోని తలనొప్పులు తెచ్చి పెడుతున్నది. దేవకుమార్‌రెడ్డికి, ఆనం వర్గానికి మొదట నుంచి ఉప్పులో నిప్పు సంబంధాలు. ఏ చిన్న కర్ర దొరికినా దాన్నే బ్రహ్మాస్త్రంగా మార్చి జనార్దనరెడ్డిని దెబ్బ తీయాలన్న తపనలో దేవకుమార్‌రెడ్డిని తమ అక్కున చేర్చుకున్నారు ఆనం సోదరులు. తమకు గల బావ, బావ మరదుల సంబంధాన్ని ముఖ్యమంత్రికి చెప్పి మరీ, వెంట బెట్టుకుని తిరుగుతున్నారు. ఇది ఆనం వర్గంలో కీలకమైన వారెవ్వరికీ సరిపడడం లేదు. మొదట వచ్చిన చెవుల కంటే వెనుక వచ్చిన కొమ్ములు గట్టివి అన్న చందంగా నిన్న గాక మొన్న వచ్చిన దేవకుమార్‌రెడ్డిని జిల్లా నాయకుడి హోదాలో ముఖ్యమంత్రితో సమావేశానికి తీసుక వెళ్లి తమను మాత్రం వెనుక వరసలో కూర్చోబెట్టడం ఏమిటి అన్న కినుకతో ఒకరిద్దరు ముఖ్య అనుచరులు తిరుగుబాటుకు సిద్ధమౌతున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయాన్ని నేరుగా వివేకానందరెడ్డి ముఖాన్నే అడిగాడట ఒక అనుచర ముఖ్యుడు. అతడి ప్రశ్నలకు చెప్పడానికి వివేకా దగ్గర సమాధానం లేదు.

మరొక ప్రక్క మాదాసు గంగాధరం కూడా ఆనం శిబిరంలో పెత్తనం చేస్తున్నాడిప్పుడు. ఇది కూడా చాలా మందికి ఒంటి మీద తేళ్లు, జెర్రులు ప్రాకిన జలదరింపు కల్గజేస్తున్నది. గంగాధరం ఎవరి ఇంట పాదం మోపితే ఆ ఇల్లు రాజకీయంగా పతనమై పోవడం చరిత్ర. మాగుంట సుబ్బరామరెడ్డి అంతటి వాడే ఆ పాద మహిమకు తట్టుకోలేక ఇబ్బంది పడ్డాడు. ఆనం సోదరులు ఆ సాహసం చేయడం మంచికా, చెడుకా అన్న చర్చ జరుగుతున్నది వారి వర్గంలో.

## పవన్‌కళ్యాణ్ అభిమానుల రక్తదానం

నటుడు పవన్ కళ్యాణ్ నటించిన 'బంగారం' చిత్రం ఆడియో విడుదల సందర్భంగా నెల్లూరులోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో 50 మంది పవన్‌కళ్యాణ్ అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని చిరంజీవి సేవా సమితి అధ్యక్షుడు కొట్టె వెంకటేశ్వర్లు, నెల్లూరు పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.అనిల్ పర్యవేక్షించారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎవి సుబ్రహ్మణ్యం కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బిలో గార్డ్ రూమ్ నిర్మాణం

నెల్లూరు ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో విఐపి, వివిఐపి గార్డు, ఎస్కార్ట్ డ్యూటీలు నిర్వహిస్తున్న పోలీసులకు కనీస వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఎపి పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ - ఎస్పీ ద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ రవిచంద్ర, గార్డ్ రూమ్ నిర్మాణానికి 3.5 లక్షలు మంజూరు చేశారు. ఆర్‌అండ్‌బి శాఖ వెంటనే ఈ రూము నిర్మించాలని ఆదేశాలిచ్చారు. తమ కష్టాన్ని గుర్తించి గార్డ్ రూమ్ నిర్మాణానికి ఒప్పుకొన్న కలెక్టర్‌కు ఎపి పోలీసు ఆఫీసర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీహరిబాబు కృతజ్ఞతలు చెప్పారు.

## తెలుగు పాటల పోటీలు

నెల్లూరు జిల్లా తెలుగు భాషోద్యమ సమితి ఉగాదిని పురస్కరించుకొని 30తేది తెలుగు పాటల పోటీలను నిర్వహిస్తుంది. ఈ పోటీలు డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సమావేశ మందిరంలో జరుగుతాయి. పోటీలలో పాల్గొన దలచిన వారు పేరు, చిరునామా, పాడదల్చుకొన్న పాట వివరాల్ని వ్రాత పూర్వకంగా 25తేదిలోగా ఎస్.దశరథరామయ్య, కార్యదర్శి, తెలుగు భాషోద్యమ సమితి, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల, శంకరాగ్రహారం, నెల్లూరు-1 చిరునామాకు పంపమంటున్నారు.

## వికలాంగుల స్థలాలు దురాక్రమించారు

నెల్లూరు వికలాంగుల కాలనీలో ప్రభుత్వం వికలాంగులకు కేటాయించిన నివేశన స్థలాలను దురాక్రమణదారులు ఆక్రమించారని జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం ఆరోపించింది. ఈ విషయమై డిఆర్‌ఓ, ఆర్డీఓ, రాపూరు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకవెళ్లినా ఫలితం లేదని వాపోయింది. వికలాంగుల కాలనీలో ఖాళీగా వున్న స్థలాలను అర్హులైన వికలాంగులకు ఇవ్వాలని, దురాక్రమణ దారులను ఖాళీ చేయించని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని సంఘం నగర కార్యదర్శి వై.బాలాజీ స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదం ఆరుగురి మరణం

కుడితిపాళెం సమీపంలో 22తేది అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరు మంది ప్రాణాలు గాలిలో కలిసిపోగా, మరో 12 మందికి బలమైన గాయాలయ్యాయి. వీరంతా కుడితిపాళెం గ్రామస్తులు. కనుపూరులో జరుగుతున్న జాతరకు ఒక లారీలో బయలుదేరిన 15 నిమిషాల్లోనే ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని నెల్లూరు పెద్దాస్పత్రిలో చేర్చారు.

## రాజ్యలక్ష్మమ్మ

2వ పేజీ కొరవ

మనస్పర్థలు, విభేదాలు వుంటే కలిసి మాట్లాడుకుని సర్దుకోవాలే తప్ప పార్టీకి నష్టం కలిగే రీతిలో ప్రవర్తించరాదని స్పష్టంగా హెచ్చరిక చేశారట ముఖ్యమంత్రి. నెల్లూరు కార్పొరేషన్ బాధ్యత మొత్తం తమకు అప్పచెప్తే గెలిపించుకుని మీ చేతిలో పెడతాము; జనార్దనరెడ్డి వర్గానికి జోక్యం ఇస్తే ఓటమి తప్పదు; జనార్దనరెడ్డి సహకారం లేకుండా కూడా కార్పొరేషన్ గెలిపించే సత్తా మాకు వుంది అని ఆ రోజు ముఖ్యమంత్రికి చెప్పింది కాబట్టే, ఆయన ఆ ప్రస్తావన తేగానే, దొంగకు తేలు కుట్టినట్లుగా గమ్మునుండి పోయారు ఆనం సోదరులు. సమావేశంలో తమకు పెత్తనం సంగతి దేముడెరుగు, పరోక్షంగా మెత్తటి చీవాట్లు పడడం; అదే సమయంలో తమకు మాట మాత్రం చెప్పకుండా జిల్లా మంత్రి రాజ్యలక్ష్మమ్మ జిల్లా స్థాయి పదవికి తన మనిషిని నియమింపచేసుకోవడం వీరిని తీవ్రంగా నిరాశ పరచింది. దానితో పాటుగా ఈ వర్గం ఎమ్మెల్యేలలో లుకలుకలు ఇక్కడే ప్రారంభం అయ్యాయి.

జిల్లా గ్రంథాలయ సంస్థ నియామకాన్ని మార్చి తీరాల్సిందే అని గట్టిగా పట్టుబట్టడం కోసం ముఖ్యమంత్రి వద్దకు వెళ్లినప్పటికీ, ఆనం సోదరులిద్దరూ ఒక్క మాట కూడా మాట్లాడలేదని; తాను విష్ణు మాత్రమే బ్రతిమలాడుకోవలసి వచ్చిందని; వీరిని నమ్ముకుని రాజకీయాలు చేస్తే తన భవిష్యత్తు ఎట్లా వుండబోతుందో అన్న భీతి కల్గుతుందని ప్రభాకరరెడ్డి బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

మొత్తం మీద ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నియామకం జిల్లా రాజకీయాలను ఒక్క కుదుపు కుదిపింది. జిల్లా విషయంలో తనకు అందరూ సమానమే అని, ఎవరినీ ప్రత్యేక దృష్టితో చూడడం తన అభిమతం కాదని చెప్పకనే చెప్పాడు ముఖ్యమంత్రి.

## వ్యయలో కష్టాలు

2వ పేజీ కొరవ

దిశలలోని రాష్ట్రాలలో జల, భూకంప బాధలుంటాయి. జన నష్టం కల్గుతుంది. నవంబరు నుంచి మతపరమైన సమస్యలు కలిగే అవకాశాలున్నాయి. నాలుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలు మారుతాయి. నాలుగైదు పెద్ద వాహన ప్రమాదాలు సంభవించవచ్చు. పశ్చిమ ఆసియా దేశాలలో యుద్ధం జరిగే అవకాశాలున్నాయి. పసిఫిక్ తీర దేశాలలో జల ప్రళయాలు, రెండు యూరప్ దేశాలలో ప్రభుత్వాలు మారు తాయి.

### కర్తరీ నిర్ణయం

11.5.2006 నుంచి 28.5.2006 తేది వరకు వాస్తు కర్తరి. గృహ సంబంధ నిర్మాణాలు పనికి రావు.

### పుష్కర నిర్ణయం

27.10.2006 కార్తీక శుక్ల పంచమి శుక్రవారం రాత్రి 7.31గంటలకు భీమరథి నదికి పుష్కరాలు ప్రారంభమవుతాయి.

### గ్రహణాలు

7.9.2006తేది గురువారం రాత్రి 11.34 నుంచి 1.10 గంటల వరకు పాదాల్పగ్రాస చంద్రగ్రహణం. 3.3.2007 శనివారం (తెల్లవారితే 4తేది రాత్రి 3.00 నుంచి 6.20 గంటల వరకు పూర్ణ చంద్ర గ్రహణాలు).

19.3.2007తేది సోమవారం ఉదయం 6.05 నుంచి 7.30 గంటలకు వరకు అర్ధాల్ప గ్రస్తోదయ సూర్య గ్రహణం సంభవిస్తుంది.

### మకర సంక్రమణం

14.1.2007తేది ఆదివారం రాత్రి 10.50గంటలకు ఉత్తరాయణ పుణ్యకాలం. అందువల్ల 14తేది భోగి, 15తేది సంక్రాంతి, 16తేది కనుమ పండుగ జరపాలి. మకర సంక్రాంతి కాలపురుషుని స్థితిని బట్టి భూమధ్య రేఖ దిగువన గల దేశాలకు అరిష్టం. వర్ష స్థితి, ఆర్థిక స్థితి, సైనిక స్థితి దేశంలో బాగుంటుంది.

## ముఖ్యమంత్రి

మొదటి పేజీ కొరవ

రోజులలో దాదాపు నూట యాభై ఫైళ్ల మీద అధికారుల సిఫార్సుకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడమో లేక ఏదీ తేల్చకుండా వెనక్కు పంపేయడమో జరిగిందని చెప్పున్నారు సిఎం పేషీ అధికారులు. గతంలో ఆయన వద్ద ఫైళ్లకు ఇటువంటి గతి పట్టేది కాదు. ఎల్లంపల్లితో పాటుగా జలయజ్ఞం, హైదరాబాద్ సిటీ శివారు భూముల అమ్మకం, అర్బన్ ల్యాండ్ సీలింగ్ నుంచి మినహాయింపు వంటి అంశాలలో అధికారులు తనను పెడదారి పట్టిస్తున్నారన్నది సిఎం అనుమానమట. తాను వారికి ఇస్తున్న స్వేచ్ఛను, వారిపై వుంచుతున్న విశ్వాసాన్ని దుర్వినియోగం చేసి, తనను ఫైళ్ల మీద ఇరికించేస్తున్నారని బాధ పడుతున్నారాయన. తనకు ఏ మాత్రం సంబంధం లేని విషయాలలో కూడా తన చేత తప్పులు చేయిస్తున్నారని ఆగ్రహంతో మండి పడుతున్నారాయన. దానితో అటువంటి అధికారుల వద్ద నుంచి వచ్చే ఫైళ్లను వెనక్కు తిప్పి పంపుతున్నారు. ఒకరకంగా అతి జాగ్రత్త పడుతున్నాడన్న మాట.

## ఐఎఎస్‌ల బదలీలు

12వ పేజీ కొరవ

శాలను వివాదాస్పదం చేయడం ఆయనకు ఒక అలవాటుగా మారిందని చెప్తున్నారు. కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, కంపెనీలతో ఆయనకు సంబంధాలు జాస్తి అని కూడా చెప్తున్నారు. వారికి ప్రయోజనం కల్పించడం కోసం ఆయన సెక్రటరియేట్ అధికారుల మీద ఒత్తిళ్లు తెస్తున్నారన్నది అభియోగం.

మరొక ప్రక్క ఇరిగేషన్ సలహాదారు సీతాపతి మీద కూడా ముఖ్యమంత్రికి అసహనం పెరిగి పోతున్నది. చంద్రబాబు వద్ద ఎంతో సన్నిహితంగా మెలగిన సీతాపతిని తెచ్చి పెట్టుకోవడం కోరి కొరివితో తల గోక్కోవడంగా మారిందని బాధపడుతున్నారు. సీతాపతికి నోరెక్కువ; అహం కారం జాస్తి. అట్లని ఆయన నిజాయితీ పరుడేమీ కాదు. కాంట్రాక్టర్లతో మామూళ్లు, ముడుపుల వ్యవహారాలు దండిగా నడుస్తుంటాయని చెప్తుంటారు. కేటగిరీ ఒకటిలో మొదట మొదట భారీగా పనులు అప్పచెప్పిన ఒక కంపెనీకి ఆయన దాదాపు ఏజెంట్ వలె పనిచేస్తుంటాడని; ఆ కంపెనీకి ఏ సమస్య వచ్చినా ఆయనే ఆ ఫైల్ చేత పట్టుక వెళ్లి క్లియర్ చేయించుక వస్తుంటాడని అందరికీ తెలుసు. మరొక ప్రక్క తన మాట వినని క్రింది స్థాయి సిఇ, ఎస్ఇలను ఏడిపించుక తినడంలో కూడా సీతాపతి ఘనాపాటి. పులిచింతల వివాదంలో ఈనాడు దినపత్రికకు సాంకేతిక సమాచారం అందజేసి, రచ్చ కెక్కించింది ఆయనే అని బయటపడింది. ఆ ప్రాజెక్టులో పని చేసే ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో సరిపడనందు వల్ల వారిని దెబ్బతీయడానికి ఈనాడును ఆసరాగా తీసుకొన్నాడు. ఈ ధోరణి ప్రభుత్వం గొంతుకు ఎప్పుడో ఒకప్పుడు ఉరి వలె పరిణమిస్తుందని ముఖ్యమంత్రి ఆగ్రహం చెందుతున్నాడు. అయితే సీతాపతికి ఇరిగేషన్ కార్యదర్శి శర్మ గారి అండదండలు పుష్కలంగా వున్నాయి. సీతాపతి లేకుంటే ఇంతభారం మోయడం తనవల్ల కాదని శర్మగారు చెప్పడం వల్లనే ఇంతకాలం ఆయన్ను భరిస్తూ వచ్చింది ప్రభుత్వం. ఇక ఈ విషయంలో ఆలస్యం చేస్తే ప్రమాదం అన్న నిర్ణయానికి వచ్చారు ముఖ్యమంత్రి. అయితే ఆయన్ను కదిలించడం అంత సులభం కాదు. జలయజ్ఞం మొత్తం ఆయన చేతుల మీదుగా నడవడంతో ఎక్కడెక్కడ ఏమేమి గోల్మాల్‌లు జరిగిందీ ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. ఆ సమాచారం బయట పెడితే, ప్రభుత్వం కుప్పకూలిపోతుంది. అందువల్ల సీతాపతి మనసు నొచ్చుకోకుండా గౌరవంగా సాగనంపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.


చందనలో ఉగాది, మార్చి ఇయరెండింగ్ సేల్

ఏడాదికి ఒక్కసారి వచ్చే అపురూపమైన సేల్
6 రోజుల ఉగాది పండుగ సందర్భంగా కనీవినీ ఎరుగని సేల్

అన్ని రకాల రెడీమేడ్స్‌పై 10% నుంచి 15% వరకు తగ్గింపు

ఒకటి కొంటే మరొకటి ఉచితం ప్రత్యేక కౌంటర్లలో

డ్రెస్ మెటీరియల్ 1 కొంటే 1 ఉచితం
కంపెనీ టీ - షర్ట్ 1 కొంటే 1 ఉచితం
ఫ్యాన్సీ వర్క్ శారీ 1 కొంటే 1 ఉచితం
ప్యాంట్ + షర్ట్ 1 కొంటే 1 ఉచితం

కాస్ట్ టు కాస్ట్ సేల్

కంచిపట్టు, గద్వాల్, వెంకటగిరి, బెనారస్, పోచంపల్లి, పుట్టపాక, కలకత్తా ఫ్యాన్సీ వర్క్ శారీస్, మైసూర్ రోలింగ్, టస్సార్ సిల్క్, రాసిల్క్ ఫ్యాన్సీ శారీస్‌పై

చందన బ్రదర్స్
G.T. రోడ్
నెల్లూరు

BANK CARDS ACCEPTED




## వైయస్‌కు వూరట

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టు సంగతి చెప్పనవసరమే లేదు. అందువల్ల ఎట్టి పరిస్థితులలోను దీనిపై దర్యాప్తుకు ఆదేశించే దుస్సాహసం చేయలేమన్న నిజం ప్రభుత్వంలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. ఫైళ్లు స్పీకర్ వద్ద పెట్టినా అదే జరుగుతుంది. ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ ముందు తప్పులను వేలెత్తి చూపితే ప్రభుత్వం జవాబుదారీ వహించక తప్పదు. ఈ పరిస్థితులలో దీనికి ముగింపు ఎట్లా పలకాలి అనే దిగులుతో చిక్కి సగమై వుండినారు ప్రభుత్వ పెద్దలందరూ. ఈ గంట గడిస్తే చాలు అన్నట్లు, ఎల్లంపల్లి నుంచి బయట పడితే చాలు అని వెయ్యి దేముళ్లకు మొక్కుతుండినారు.

ఇటువంటి సంక్లిష్ట సమయంలో చంద్రబాబు అన్న చిన్న మాట ప్రభుత్వానికి ఊపిరి పోసింది. స్పీకర్‌కు తాము ఇచ్చిన ఆధార పత్రాలలో ప్రాజెక్టు అంచనా వ్యయం నిజమైనది కాక, వ్యూహాత్మకంగా తప్పుడు సంఖ్య ఇచ్చామని; ప్రభుత్వం అప్పుడైనా అసలు సంఖ్య ఎంతో బయట పెడుతుందేమోనన్న ఆశ పడ్డామని చంద్రబాబు అన్నారు. ఆ మాట విన్నదగానే కాంగ్రెస్ శాసనసభ్యులు ఎగిరి గంతులేశారు. చంద్రబాబు చెప్పేవన్నీ తప్పుడు మాటలు, ఇచ్చేవన్నీ ఫోర్జరీ పత్రాలు అని ఎదురుదాడికి దిగారు వారు. ఎల్లంపల్లిలో ఏ అవినీతీ జరగలేదని, చంద్రబాబు దురుద్దేశంతో ఇంత రచ్చ చేశాడని, అందుకు ఆయన మాటలే సాక్ష్యం అని గద్దించి మాట్లాడారు. తానెంతగా నోరు జారిందీ అర్థమైన చంద్రబాబు కోలుకోక ముందే ఈ అంశంపై ప్రభుత్వం సమాధానం చెప్పడం పూర్తి అయి, సభలో ఈ వివాదం ముగిసి పోయినట్లుగా ప్రకటించి వేశారు. ఆ వుత్సాహంతో ఫైళ్లను చూపించడానికి కూడా తాము సిద్ధమేనని, అయితే స్పీకర్ ముందు కాక, మంత్రి ముందు పెడతామని, ప్రతిపక్ష నేతలెవరైనా వచ్చి చూసుకోవచ్చునని ప్రకటించాడు ముఖ్యమంత్రి.

ఎల్లంపల్లి నుంచి ఇంత సునాయాసంగా బయటపడి పోవడం రాజశేఖరరెడ్డి అదృష్టం తప్ప వేరు కాదు. ఆకాశం నుంచి ఎవరో దేవతలు ఆయన్ను ఇటువంటి సమస్యల నుంచి గట్టెక్కిస్తున్నట్లుగా కన్పడుతున్నది. నిజానికి గత నెల రోజులుగా రాజశేఖరరెడ్డి జాతక చక్రంలో నక్షత్రాల గమనం సక్రమంగా లేదు. కేంద్ర క్యాబినెట్‌లో ఆయన అడిగిన సాయిప్రతాప్‌కు అవకాశం ఇవ్వక పోవడం; తర్వాత జరిగిన రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో ఆయన కోరిన కెవిపి రామచంద్రరావుకు, పెన్నా సిమెంట్స్ కంపెనీ అధినేత ప్రతాప్‌రెడ్డికి స్థానం కల్పించక పోవడం; ఇవ్వవద్దు అని ఎంతగా బ్రతిమలాడినా దాసరి నారాయణరావుకు మాత్రం టిక్కెట్ ఇవ్వడం వంటి పరిణామాలు ముఖ్యమంత్రి శిబిరంలో ఒక విధమైన నిరాశావహ వాతావరణం అలుముకునేట్లు చేశాయి. ముఖ్యమంత్రికి అధిష్ఠానం అనుగ్రహం తగ్గిందన్న సూచనను వ్యాప్తి చేశాయి. మరొక ప్రక్క ఎల్లంపల్లిపై కేంద్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ వర్గాలు, పార్టీ ప్రతినిధులు కూడా సమాచారం సేకరించారన్న వార్తలు వచ్చాయి. రాష్ట్రంలోని జలయజ్ఞం రాజకీయవాదులు, కాంట్రాక్టర్లు, అధికారులకు కామధేనువు వలె మారిందన్న అభిప్రాయం అధిష్ఠానంలో కల్గించడానికి అసమ్మతివాదులు తమ శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తున్నారు. ఇన్ని సమస్యల మధ్య చిక్కుకున్న ముఖ్యమంత్రి, ఒక్క ఎల్లంపల్లి గొడవ నుంచి గౌరవ ప్రదంగా తప్పుకుంటే చాలు, తతిమావి వాటంతట అవి సర్దుకుంటాయి అనే అభిప్రాయంలో వుండినారు. ఆయన కోరుకున్నట్లే, అనుకోకుండా చంద్రబాబు నుంచే అందుకు సహకారం లభించడం నిజంగా అదృష్టం.

చంద్రబాబు నోరు జారడం వల్ల ఎల్లంపల్లి విషయంలోనే కాదు, మొత్తం జలయజ్ఞం అవినీతి కుంభకోణాల నుంచే ప్రభుత్వానికి విముక్తి లభించింది. రేపటి నుంచి ప్రతిపక్షాలు ఏ ఆరోపణలు చేసినా, ఆధారాలు చూపినా అవన్నీ నకిలీ అని చెప్పి తప్పించుకునే అవకాశం చిక్కింది. అది కూడా ప్రభుత్వానికి పెద్ద ఉపశమనం. అయితే ఈ అవకాశాన్ని అడ్డం చేసుకుని అధికారులు ఇంకెంతగా బరితెగించి పోతారో అన్నది అంచనాకు అందడం లేదు. జలయజ్ఞంలో కనీసం పదివేల కోట్ల రూపాయలు ఇట్లా అక్రమ మార్గాలలో కాంట్రాక్టర్ల జేబులలోకి చేరిపోవచ్చునని ఒక అంచనా. ప్రపంచ చరిత్రలోనే ప్రభుత్వ ధనాన్ని ఇంత స్వేచ్ఛగా ఆరగించే సాదృశ్యం మరొకటి లేదు. ఇక ముందు వుండబోదు.

## బాగున్నారా...

మొదటి పేజీ తరువాయి

అక్కడకు రావడంతో ఆ పిల్లవాడిని పట్టుకుని సతాయించేశాడు దగ్గుపాటి. తండ్రిని అడగలేక పోయిన మాటలన్నీ కుమారుడి దగ్గర మాట్లాడి సంతృప్తి పడ్డాడట.

## గంజాయి దమ్ము

5వ పేజీ తరువాయి

వెళ్లగా రోడ్డు ప్రక్కన పడి వున్న అనాథ కనిపించింది. మిగతావాళ్లలా తాను ముందుకు వెళ్లకుండా వెనువెంటనే ఆమెను పెద్దాస్పత్రిలో చేర్పించి మందు, మాకు ఇప్పించాడు. ఆమె కోలుకొనే వరకు మంచి చెడ్డలు చూడమని యువజన నాయకుడు పెయ్యల విష్ణువర్ధన్‌కు బాధ్యతలు అప్పగించాడు.



అల్లూరులో రేషన్ కార్డుల జారీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి.

## కార్యదర్శిపై వేటు

5వ పేజీ తరువాయి

సుల మనుగడ కష్టమని విజయవాడ తపాలా సర్వీసుల డైరెక్టరు వెంకటేశ్వర్లు చెప్పారు. 19తేది బుచ్చిరెడ్డిపాళెంలో గ్రామీణ తపాలా బీమా మహా మేళాలో పాల్గొని ప్రసంగించారు. విజయవాడ డివిజన్‌లో నెల్లూరు పురోగతిలో వున్నట్లు కితాబిచ్చారు. ఈ సంవత్సరం 73.7 కోట్లతో గ్రామీణ తపాలా బీమాకు గుర్తింపు తెచ్చిన నెల్లూరు సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ వై.ఉపేంద్రను ప్రశంసించారు.



# 'యంత్రం' రక్షణ పత్రం!

వి.వెంచలయ్య పొదలకూరు

* *గృహ లోపాలు సరి చేసుకునే లోగా ఏం చేయాలి? యంత్రాన్ని ఎప్పుడు ప్రతిష్ఠించుకోవాలి?*

గృహ లోపాల పునర్నిర్మాణాల ఆలస్యం అనివార్యం అయినట్లయితే వెంటనే వాస్తుకు, యజమాని నక్షత్రానికి అనువైన 'యంత్ర ప్రతిష్ఠ' చేయించుకొంటే మంచిది.

వి.శ్రావ్య గూడూరు

* *గృహ నిర్మాణాల్లో పశ్చిమ, దక్షిణ వాస్తు సూత్రాల్ని గురించి చెప్పండి?*

మీరన్న దిక్కుల్ని గదితో గానీ, నీటి ట్యాంకుతో గానీ పూర్తి చేయడం శ్రేయస్కరం.

వాస్తు సందేహాలు - సమాధానాలు
ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
ఫోన్ : 0861 - 5532337
4వ వీధి, గాయత్రినగర్
ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు - 4.

ఎస్.శ్రీనివాసులు తిరుపతి

* *కొలతలు సరి సమానం గానే వున్నాయి. దిక్కుల విషయంలోనే అనుమానమంతా?*

మీ ప్లాను ప్రకారం ప్రహరిలోని ఇంటిని ఈశాన్యం వైపు త్రిప్పి కట్టారు. అంచేత దిక్కుల పెరగడమూ, తరగడమూ జరిగాయి.

...త్రిస్తాయి.

వి.తిరువేంగడాచార్యులు శ్రీకాళహస్తి

* *శ్రీకాళహస్తి ఆలయాన్ని 'వాస్తు' ప్రకారం చూస్తే చాలా దోషాలు కనిపించడం లేదా?*

ఆలయాల్ని 'ఆగమశాస్త్ర' దృష్టితో చూడండి. మీ యింటికి 'వాస్తు శాస్త్రం' అవసరం. ఈ విధానాల్ని గుర్తుంచుకోండి.

జ్యోతి చెన్నై

* *మఠాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు పూజా స్థానాలు కదా వాటికి కూడా వాస్తు అవసరమా?*

ఏ నిర్మాణంకైనా సైన్సు సూత్రం, వాస్తు సూత్రం. వాస్తు లేకపోతే సమస్యల సుడిగుండాలవుతాయి.

ఎస్.సత్యనారాయణ అనంతపురం

* *పుట్టపర్తిలో పూర్వం జరిగిన దురదృష్టకర సంఘటనలకూ, వాస్తుకూ సంబంధం వుందా?*

వాస్తు దోషాలున్నప్పుడు ఎక్కడ, ఏ సంఘటనలకైనా ఆస్కారం వుంది.

కె.శరభయ్య పెనుగొండ

* *మాది తూర్పు రోడ్డు, ఇల్లు దక్షిణం వైపు ఉంది. అందరూ అనుమానాలు చెబుతున్నారు.*

మీ ప్లాను, ఫొటో ప్యూ కాపీలు పరిశీలించాను. మీరు ఆగ్నేయ బ్లాకు ప్లాటు. దక్షిణం రోడ్డుంది కాబట్టి దక్షిణ నిర్మాణం వల్ల కీడు లేదు. అయితే మొత్తం దక్షిణ నిర్మాణ వాస్తును పాటించండి.

ఎస్.లక్ష్మీప్రసూన బెంగుళూరు


* *మా శ్రీవారికి ఈనెల ప్రారంభం నుంచి అనారోగ్యంగా వుంది. ఇంట్లో చేరి కొన్నాళ్లే అయింది.*

మీ యింట్లోని తూర్పు, పశ్చిమ గృహ దోషాలు మీ వారి ఆరోగ్యానికి కారణం కావచ్చు. గృహ నిర్మాణం తర్వాత దోషాలు మండలం రోజుల తర్వాత విజృం...

## నీటి కోసం

5వ పేజీ కొరవ

బడిన నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లోని 20 లక్షల మంది ప్రజలు లబ్ధి పొందుతారన్నారు. వీరిని ఆదుకొని ఆ ఘనత కాంగ్రెస్‌వాదులు దక్కించుకొన్నా తమకు ఆమోదమేనన్నారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్, సీతారాంసాగర్, వెలుగొండ, బ్రహ్మంసాగర్ జలాలు కావాలని అందరూ కోరుతున్నారని అయితే వీటన్నింటికీ కృష్ణా జలాలే ఆధారమన్నారు. ఈ ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాలెలా వున్న తన హయాంలో ప్రతిపాదించబడ్డ సోమశిల ప్రాజెక్టు వరద కాలువ ద్వారా ఎత్తిపోతల పథకం చేపట్టి ఉదయగిరికి సాగు నీరందించాలని కోరారు. ప్రకాశం జిల్లా పరిషత్ అధ్యక్షుడు ముక్కు కాశిరెడ్డి ప్రాజెక్టుల భాషలో రెండో దశ అంటే అది ప్రక్కన పెట్టినట్లేనని, అలా కాకుండా నాగార్జున సాగర్, వెలుగొండ కుడి కాలువలు మొదటి దశలో చేపట్టేలా పోరాటం చేయాలని కోరారు. దర్శి మాజీ ఎమ్మెల్యే, వయోవృద్ధుడైన రావిపాటి మహానంద నాగార్జున సాగర్, వెలుగొండ ప్రాజెక్టుల కోసం తాము నడిపిన ఉద్యమాలను గుర్తు చేసుకొన్నారు. పూల సుబ్బయ్య, గుజ్జుల యలమందారెడ్డి వెలుగొండ సాధన కోసం అనుసరించిన పోరాట మార్గాన్ని వివరించారు. ఒంగోలు మాజీ ఎమ్పీ కాటూరి నారాయణస్వామితో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన గరికపాటి సీతారామయ్య, మాదాల తిమ్మయ్య, కె.అరుణ, టి.ఎం.కొండయ్య, పాడిబండ్ల గోపాలస్వామి, పోలూరి రఘునారెడ్డి, ఎం.ఎల్.నారాయణ, కొన్నలగడ్డ రామానాయుడు, నైటి నాయుడు, తిప్పిరెడ్డి నార్థవరెడ్డి, కోనంకి శ్రీనివాసులు నాయుడు, కె.అమర్‌నాథ్‌రెడ్డి, అంబటి కృష్ణారెడ్డి, అల్లూరు రాజా, కామేపల్లి వెంకటరత్నం, కర్నాటి రోశయ్య, దంతులూరి వెంకటేశ్వర్లు, గాలి నరసవ నాయుడు, ఆరికట్ల జనార్దన్‌నాయుడు, బొల్లా మాల్యాద్రి వంటి పలు రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు ఒక్కచోట చేరి సమావేశాన్ని జయప్రదం చేశారు. వీరంతా ఆరంభ శూరుల్లా ఇంతటితోనే ఆగుతారో, అనుకొన్న లక్ష్య సాధన కోసం పట్టువిడవక పోరాడుతారో వేచి చూడాల్సిందే.



జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న మందిపాటి ప్రవీణ్‌రెడ్డి. ప్రక్కన బాలసుధాకర్, కోటీశ్వరరెడ్డి, యేసునాయుడు, నాగరాజు తదితరులున్నారు.

## వైభవంగా సాగుతున్న భాషోత్సవాలు

ఉదయగిరి నియోజక వర్గంలో ప్రాథమిక విద్యాశాఖ నిర్వహిస్తున్న భాషోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. విద్యా విధానంలో విద్యార్థులకు సృజనాత్మకత పెంపొందించే ఉద్దేశంలో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమాలు బాగానే వున్నాయి. గ్రామ స్థాయిలో నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ ఛేర్మన్ చెంచలబాబు యాదవ్, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర మండల స్థాయి ప్రముఖులు కూడా పాల్గొని నిర్వాహకులను, విద్యార్థినీ విద్యార్థులను ఉత్సాహపరుస్తున్నారు.

## దారుణ హత్య

5వ పేజీ కొరవ

హింసలు పెట్టడంతో వారు దూరంగా వున్నారు. ఇతగాడికి పొదుపులక్ష్మి గ్రూపు లీడర్ ముక్కంటి గోవిందమ్మ ఆశ్రయం కల్పించింది. ఈమె అండతో దర్జాగా నోట్లో బీడి పెట్టి పొగలు వదులుతూ గ్రామంలో తిరిగేవాడు. ఈ గ్రామానికి చెందినమానసిక వికలాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన కేసులో నరేంద్రను కాపాడి శిక్ష పడకుండా ఈమె తోడ్పాటు అందించింది. దీంతో ఇతగాడు రెచ్చిపోతుండేవాడు. చిల్లర దొంగతనాలకు అలవాటు పడడంతో పాటు, డబ్బులు అవసరమై ఈ హత్యకు పాల్పడ్డాడు. ఇక రెండవ నిందితుడు పల్లెకొండ శివను కుటుంబీకులు వదలి వేయడంతో దొంగగా మారాడు. ఈ క్రమంలో విద్యుత్ మోటార్లు చోరీలు చేసేవాడు. ఈ ఇద్దరు ఘనులు తోడై హత్యకు పాల్పడ్డారు. ప్రశాంతంగా వున్న కోడూరులో ఈ హత్య చర్చనీయాంశమయ్యింది.

## రచ్చకు సిద్ధం

5వ పేజీ కొరవ

మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి స్వీకరించారు. ఏప్రిల్ 7, 8 తేదీల్లో ఉదయగిరిలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టుల సమక్షంలో చర్చకు సిద్ధమని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమ నాయకులు చర్చకు సిద్ధం కావడం కాంగ్రెస్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు కావలసినంత మేత దొరికినట్టయ్యింది. మొత్తంమీద ఈ బహిరంగ చర్చ అంశం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.



పిడతాపోలూరులోని రత్నం విద్యా సంస్థలకు విచ్చేసిన బిజెపి అగ్రనేత వెంకయ్య నాయుడిని సన్మానిస్తున్న ఆ సంస్థల అధినేతలు కె.వి.రత్నం, వేణుగోపాల్, డాక్టర్ కృష్ణకిషోర్.

# కవిత, నాటకం జోడు గుర్రాలు

సాహిత్య రచనలోనూ, సంస్థల పర్యవేక్షణలోనూ సింగుముని సుందరం అందెవేసిన చేయి. చిత్తూరులో 'అరసం' ఆవిర్భావంలోనూ, 'నూతలపాటి సాహితీ సత్కారం' సంస్థ ఉద్భవంలోనూ ముఖ్యమైన పాత్ర పోషించారు మునిసుందరం.

మునిసుందరంలో నిజాయితీ వుంది. అంతకు మించిన సహృదయత వుంది. ఇవి ఉత్తమ కవికి వుండవలసిన లక్షణాలు.

అడవి పూలు కవితా సంపుటిలో ప్రారంభమైన ఆయన కవితోద్యమం, మానవతా! మేలుకో, గుండెల్లో వాన, ముని సుందరాలు, ఈ గుండె అలసిపోదు, చీకటి దీపాలు, బైక్యూక్యూ మొదలైన కవితా సంపుటులతో కొనసాగింది. మునిసుందరానికి సమాజాన్ని వీక్షించే, చారచక్షువులున్నాయి. ఉద్వేగం, ఉత్సాహంతో కొనసాగే హృదయముంది. సామాజిక చైతన్యాన్ని ఆవిష్కరించే కలం బలం వుంది. అందుకే ఆయన కవిత్వం మధ్యతరగతి మరో నేత్రం అయింది.

మునిసుందరం అటు కవిత్వంలోనూ ఇటు నాటక రంగంలోనూ అందెవేసిన చేయి. చిత్తూరు ఆర్ట్ లవర్స్ యూనియన్ నిర్వాహకులు చిత్తూరు వి.జయరాం ముని సుందరాన్ని నాటక రచయితగా మలిచారు. యూనియన్ ఆస్థాన విద్వాంసులుగా అనుబంధంతో బంధించారు. అందువల్ల రచయిత పదికి పైగా నాటకాలు రాయగలిగారు. ఇది యథార్థం కూడా!

రచయిత అహంబ్రహ్మ!, ఇది కథ కాదు, ఇచ్చుట సన్మానాలు చేయబడును, ఇదేనా న్యాయం? ఏ వెలుగులకీ ప్రస్థానం, నిజం కాటేసింది, పక్షులు, చరిత్రలో చిరిగిన పుట, వరూధినీ గాంధర్వం, సింగారం వంటి సామాజిక స్పృహ గల నాటకాలు రాశారు. వీటిలో అన్నీ ఆర్ట్ లవర్స్ యూనియన్ ద్వారా ప్రదర్శింపబడినవే!

అదో స్వర్ణయుగం, అంతటి మహిమోన్నతమైన కాలం మళ్లీ వస్తుందని నేననుకోను.

ఇందులోని 'ఇచ్చుట సన్మానాలు చేయబడును', 'పక్షులు' నాటికలు స్త్రీ పాత్రలేని హాస్య నాటికలు. వీటిలో వున్న సుగుణం ఏమిటంటే వివిధ భంగిమలు, హావభావాల వల్ల ప్రేక్షకుల్లో హాస్య రసాన్ని పండించవలసిన దుస్థితి ఈ నాటకాలకు లేదు. పటిష్టమైన డైలాగులు ఉచ్చరించగానే చాలా సందర్భాల్లో ప్రేక్షకులు 'గొల్లు' మంటారు.

సన్మానాల మీద ఉబలాటం వున్న చాలామందికి ఆ పని చేసిపెట్టే సంస్థను గురించి రచయిత రాసిన 'సెటైరు' ఇచ్చుట సన్మానాలు చేయబడును.

ఇందులోని పంతులు, షణ్ముగం, రామనామం, జనశ్రీ పాత్రలు సమయోచిత హాస్యాన్ని అందిస్తాయి.

'పక్షులు' మరో విభిన్నమైన నాటిక – ఇందులోని పతి, కిట్టి, సుందరం, ఏడుకొండలు, కవి, డైరెక్టరు పాత్రలు మన నిత్య జీవితంలో ఎదురయ్యే జీవితాల్లో తారసపడతాయి. ఇందులోని రిక్షావాడి 'చిత్తూరు అరవయాస' పసందుగా వుంటుంది. ఆకట్టుకొంటుంది.

పాత్రలు హాస్యం కోసం సృష్టించబడినవి కాదు గనుక సందర్భోచిత హాస్యం 'పక్షులు' నాటకాన్ని రక్తి కట్టిస్తుంది.

**పుస్తక సమీక్ష**

**ఇచ్చుట సన్మానాలు చేయబడును**
**పక్షులు (రెండు నాటికలు)**
రచయిత
**ఎస్.మునిసుందరం**
సమీక్షకుడు
**పాయసం సుబ్రహ్మణ్య మహర్షి**
ప్రతులకు : శ్రావణి ప్రచురణలు, కోటకొమ్మలవీధి, తిరుపతి– 517501.
పుటలు: 38 మూల్యం: 50/-

సమాజం మునిసుందరం కథా వస్తువు. అంచేత ఊహలు వీరి రచనల్లో కనిపించవు. సజీవ సామాజిక పాత్రలే, రంగస్థలంలో కనిపించినట్లవుతాయి. ప్రేక్షకుడు పాత్రల హావభావాల్లో తాదాత్మ్యం చెందుతాడు.

సమాజం పట్ల మునిసుందరానికి అపారమైన ప్రేమాభిమానాలున్నాయి. అంచేతే వ్యవస్థలోని దుర్నీతిపై విపరీతమైన కసి వుందీ రచయితలో.

అందువల్ల ఒక కవితలో అంటాడు కదా?

*"ప్రజాస్వామ్యం ఒక బూటకం*
*ఎన్నికలు, ఒక నాటకం*
*వెధవాయిలు మనం!"*

రోజువారీ దినచర్యలో ఒత్తిళ్ల మాయాజాలంలో బంధీలవుతున్న జనానికి ఈ నాటికలు మలయ సమీరంలా ఆహ్లాదాన్నిస్తాయి. ఉదయ శీతల పవనాల్లో హాయినిస్తాయి. అంచేత మునిసుందరం నాటకాల్ని ఆహ్వానిస్తూ, స్వాగతం పలుకుదాం!

# హీరోలతో జగడం

తెలుగు సినిమాల్లో విలన్ ప్రకాష్‌రాజ్ కొందరు అగ్ర హీరోల మధ్య కోల్డ్‌వార్ జరుగుతుంది. ఇటీవల కాలంలో తెలుగు చిత్రాలలో ప్రకాష్‌రాజ్ నటించక పోవడానికి ఇదే కారణమంటున్నారు. ప్రకాష్‌రాజ్‌కు కొందరు అగ్ర హీరోల మధ్య తేడా రావడానికి కారణాలు విశ్లేషిస్తే; ప్రకాష్‌రాజ్ తన ప్రతిభ గూర్చి ఎక్కువగా చెప్పుకొంటున్నాడట. తన నటన ముందు కొందరు హీరోల నటన తేలిపోతుందని చేస్తున్న ప్రచారంతో పరిస్థితులు

**ప్రకాష్‌రాజ్‌కు తగ్గిన అవకాశాలు**

వికటించాయి. చిరంజీవి తృణీకరించిన ఉదయ్‌కిరణ్‌ను హీరోగా పెట్టి తమిళంలో సినిమా తీయడంతో ఆయన్ను అభిమానించే నిర్మాతలంతా ప్రకాష్‌రాజ్‌కు దూరం జరిగారు. కారణాలు ఏమైనా ప్రకాష్‌రాజ్ తెలుగు చిత్రరంగానికి దూరం కావడం పెద్దలోటు. ముఖ్యంగా మంచినటనను ఆస్వాదించే ప్రేక్షకులకు ఈ వ్యవహారం తీవ్రమైన నిరాశ కలిగేలా చేస్తుంది. అన్నట్లు ప్రకాష్‌రాజ్ పాత్రలను హీరో శ్రీహరి చేత వేయించాలని పరిశ్రమలో కొందరు చూస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి శ్రీహరి ఒప్పుకొంటాడా?

# వర్మే సర్వస్వం

దర్శకుడు రాంగోపాల్‌వర్మ ఎప్పుడు ఎవరిని పైకెత్తుతాడో ఎవరిని ఎత్తి కుదేస్తాడో తెలీదు. గతంలో ఊర్మిళ, అంత్రామాలిలను అందలమెక్కించాడు. ఇప్పుడాయన దృష్టి నిషా కొఠారి మీద పడింది. ఈమె అందాలు భిన్న కోణంలో కనపడేట్లు విభిన్నమైన కాస్ట్యూమ్స్ రాంగోపాల్ వర్మనే స్వయంగా ఎంపిక చేయడం బాలీవుడ్‌లో వార్తాంశమయ్యింది. ఈ వ్యవహారమై నిషా మాట్లాడుతూ నా కెరీర్‌కు ఇప్పుడు నిశ్చింత ఏర్పడింది. రాము చేతుల్లో పడడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. నా జీవితంలో ఇప్పుడు ఒత్తిడి తగ్గింది. వర్మ నేతృత్వంలో తన కెరీర్ ఉజ్వలంగా ప్రకాశిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. అయితే రాము దగ్గర వుండడం టెన్షన్ ఫ్రీనా... డబుల్ టెన్షనా అన్నది అనుభవమ్మీద కానీ అర్థం కాదని ఆమె సన్నిహితులు హెచ్చరిస్తున్నారట. అయినా ఇవేమీ నిషా పట్టించుకోవడం లేదు.

### పూజా బేడికి మళ్లీ పెళ్లి

కామసూత్ర మోడల్ గర్ల్‌గా సెక్సీ ఇమేజ్‌ను బాగానే పొందిన పూజా బేడీ కొంతకాలంగా టీవిలో 'జస్ట్ పూజా' అనే టాక్‌షోలో ప్రేక్షకుల్ని రంజింప చేస్తోంది. భర్త ఫరాన్ ఫర్నిచర్

తరువాయి 11వ పేజీలో



'రామ్'లో నితిన్, జెనీలియా

# బరితెగింపుపై కోర్టులో కేసు

హీరోయిన్ ఖుష్బూ వివాదం సమసిపోక ముందే రీమాసేన్ వివాదంలో చిక్కుకొంది. వల్లవన్ చిత్రంలో రీమాసేన్ తన శారీరక ఒంపు సొంపులను ఆరబరచినట్లుగా కనిపించే గుడ్డ పీలికలు ధరించి నటించింది. ఈ ఫొటోలను ఓ తమిళ సాయంకాలం పత్రిక ప్రచురించింది. రెచ్చగొట్టేవిగా వున్న ఆ ఫొటోలను ప్రచురించిన పత్రికను, ఫోజులిచ్చిన రీమాసేన్‌ను ఒక వ్యక్తి కోర్టుకు లాగాడు. ఈ వ్యవహారమై రీమాసేన్ మాట్లాడుతూ తను ఫోజులిచ్చిన ఫొటోలు పెద్దగా సెక్సీగా లేవనీ, తను పరిమితంగానే అందాలు బహిర్గతం చేస్తానే తప్ప విచ్చలవిడితనం తన అభిమతం కానే కాదంటోంది. సెక్సీ పాత్రలు ధరించాలని బాలీవుడ్ నుంచి పలు ఆఫర్లు వస్తే ఇష్టం లేక వాటిని తిరస్కరించినట్లు చెప్పింది. రీమాసేన్ సెమిన్యూడ్ ఫొటోలపై పెట్టిన కేసు సెక్సీ స్టార్లలో భయం కలిగిస్తోంది. పలు ఇంగ్లీషు పత్రికల కోసం బాలీవుడ్ భామలతో పాటు దక్షిణాది హీరోయిన్లు చాలా సెక్సీ కాస్ట్యూమ్స్‌లో ఫొటో సెషన్ చేస్తున్నారు. రీమాసేన్‌పై పెట్టిన కేసు తరహాలో తమపై కూడా కేసు ఎవరైనా పెడతారేమోనన్న భయం వీరిని వెంటాడుతుంది.

**సెక్సీ స్టార్లలో వణుకు**

### రైమా ఆనందం

రామ్‌గోపాల్‌వర్మ హిందీ రీమేక్ 'షాక్' చిత్రంలో హీరోయిన్ పాత్రకు ఎంపికైన బక్కపల్చని భామ రైమాసేన్‌లో ఆనందం దాచాలన్నా దాగడం లేదు. ఎందుకంటే 'షాక్'తో పాటు ఫరాన్ అఖ్తర్ నిర్మిస్తున్న 'హనీమూన్ ట్రావెల్స్ ప్రై. లిమిటెడ్'లో కేకేమీనన్ సరసన ఆమె ఎంపికయ్యింది. ఈ సినిమాకు రీమాకగ్తి దర్శకత్వం వహిస్తున్నది. ఈ సినిమాకు దర్శకుడు ఫరాన్ కాకపోతేనేం, నిర్మాతగా అతను తన సినిమాకు నన్ను ఎంచుకోవడం గొప్ప విషయమే కదా అంటుంది. గాడ్‌మదర్, చోకర్‌బాలిలతో పాటు ఇటీవల పరిణీతలో విద్యాబాలన్ చెల్లెలిగా చేసిన చిన్న పాత్ర ఆమెకు మంచి గుర్తింపునే తీసుకొచ్చాయి. అది చిన్న పాత్ర కావచ్చు. కానీ ఆ పాత్రలో జనం నన్ను నటిగా గుర్తించారంటుంది ఒకింత గర్వంగా. అయితే 'షాక్' సినిమా ఆలస్య

తరువాయి 11వ పేజీలో

# హీరోయిన్లు కాదు హీరోలు

సినిమాల్లో రిస్కీ సీన్లు సహజంగా హీరోలు చేస్తుంటారు. ఇప్పుడు హీరోయిన్లు, హీరోలను మించి సాహస కృత్యాలు చేస్తున్నారు. సచిన్ బజాజ్ రూపొందిస్తున్న 'సక్షి'లో ఒక సన్నివేశం కోసం సమీరారెడ్డి ఏకంగా 15వందల అడుగుల ఎత్తు నుంచి దూకేసింది. ప్రాణాలకు తెగించి ఈ ఫీటు ఎందుకు చేయాల్సి వచ్చిందని సమీరాని అడిగితే, సన్నివేశంలోని ఫీల్ మిస్ కాకుండా సహజత్వం కోసం దర్శకుడు ఓంప్రకాష్ టక్కస్ చేసిన ప్రయత్నానికి

**సమీరా, పాయల్ చేసిన సాహసాలు**

సంపూర్ణ సహకారం అందించానని చెప్పింది. మరో వైపు మగ వ్యభిచారి ఇతివృత్తంతో సాగే 'మిస్టర్ 100 పర్సెంట్' చిత్రంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న పాయల్ రోహ్తగి, నట విటులతో మరీ బోల్డ్‌గా నటిస్తోంది. వ్యభిచార వృత్తి కూపంలో నుంచి ఒక పురుషుడిని బయటికి తీసుకరావడానికి కృషి చేసే పాత్ర నాది. మగ వ్యభిచారులపై సినిమా అనగానే ఎంతో ఆసక్తి కలిగింది. కథానుగుణంగా కొన్ని సన్నివేశాలు బోల్డ్‌గా వుంటాయి. వాటిల్లో నేను నటించడంపై ఎన్ని పుకార్లు వచ్చినా పట్టించుకోనని చెబుతుంది.

# పాపం అమీషా

జీవితంలో ప్రతి ఒక్కరూ ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సిందే. ఆటపోట్లు లేనిది జీవితమే కాదు. హీరోయిన్‌గా రాణించి రచ్చగెలిచినా తన తల్లితండ్రులు చేసిన మోసంతో ఇంట గెలవలేకపోయానని వాపోతుంది అమీషా. సంపాదించిన మొత్తంలో 12 కోట్ల రూపాయల్ని తన తల్లితండ్రులు కాజేశారంటూ అమీషా ఇటీవల కోర్టు కెక్కి నానా రాద్ధాంతం చేసింది. అంతేకాకుండా విక్రమ్‌భట్‌తో సాగిస్తున్న ఎఫైర్ కూడా దాదాపు బెడిసికొట్టింది. ఇవి చాలవన్నట్లు ఈ యేడాది ఇప్పటి వరకు విడుదలైన అమీషా రెండు చిత్రాలు వధా, ఎలాన్ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఇలా రీల్ లైఫ్‌లో, రియల్ లైఫ్‌లో స్ట్రగుల్ ఫేస్ చేస్తున్న అమీషాను భవిష్యత్తు ఏమిటని అడిగితే రాబోయే సినిమాలేనని చెప్పింది.

### నోరు తెరవను

హీరోయిన్ రిమ్మిసేన్ ఈ మధ్య అక్షయ్ చాలా మంచివాడందట. అంతే పుకార్ల మీద పుకార్లు వచ్చి ఆమెను చికాకు పరిచాయట. షాహిద్ కపూర్ నవ్వితే చాలా చక్కగా వుంటుందని రిమ్మి అన్నదో లేదో... కరీనాకపూర్‌కు ఇప్పుడు రిమ్మి అంటే పీకల వరకు కోపమని ముంబాయి నుంచి వచ్చే ఫిల్మ్ పత్రిక

తరువాయి 11వ పేజీలో

# ఐశ్వర్యకు డూప్

సల్మాన్‌ఖాన్ సరసన 'లక్కీ' సినిమాలో నటించడం ద్వారా తెరంగేట్రం చేసిన స్నేహా ఉల్లర్‌ని చూసిన వాళ్లంతా ఆమె అచ్చంగా ఐశ్వర్యరాయ్‌కు కార్బన్ కాపీలా వుందన్నారు. అందువల్లే ఆమెకు ఆ సినిమా అవకాశం వచ్చి వుండొచ్చని కూడా అనుకున్నారు. ఆ సినిమా ఫెయిలయినా ఆ వెంటనే ఆమె సల్మాన్ తమ్ముడు సొహైల్ ఖాన్‌తో 'ఆర్యన్'లో నటించింది. తొలి సినిమాలో కాలేజి అమ్మాయిగా కనిపించిన ఆమె రెండవ సినిమాలో ఒక బిడ్డకు తల్లిగా నటించింది. జనం తనను ఐశ్వర్యరాయ్‌తో పోలుస్తుండడాన్ని వ్యాఖ్యానిస్తూ; తాజ్‌మహల్ ఫొటోను చూసినప్పుడు, అది తాజ్‌మహల్‌లా వుందని జనం చెబుతుంటారు. ఏమైనా ఈ పోలిక నాకు మేలు కలిగించేదే. అయితే ఐశ్వర్యతో వాళ్లు నన్ను పోల్చడం కేవలం తెరకే పరిమితమని నేను భావిస్తా. అంతకంటే మరేమీ వుండదు. ఈ వృత్తికి నేను కొత్త, అందువల్ల నేనెవరికీ పోటీ కాను అంటోంది. అంటే ఐశ్వర్యకు పోటీగా ఖాన్

తరువాయి 11వ పేజీలో

## కొత్త పోకడలు, మలుపులతో

# ఆకట్టుకొనే 'షాక్'!

**చిత్ర సమీక్ష**

**గ్రిద్దలూరు గోపాలరావు**

"షాక్" రవితేజ హీరోగా, జ్యోతిక హీరోయిన్‌గా, టాబు ఒక ప్రధాన పాత్రలో హరిశంకర్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ రామ్‌గోపాల్‌వర్మ నిర్మించిన చిత్రమిది. కథ, మాటలు కోన వెంకట్ వ్రాశాడు.

కథలో భార్యాభర్తల ప్రేమ బంధం ప్రధానాంశం. శేఖర్ (రవితేజ), మధురిమ (జ్యోతిక) ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. ఇద్దరూ ఉద్యోగం చేస్తుంటారు. మధురిమ గర్భవతి అవుతుంది. మిద్దె మీద కాపురముంటారు. గర్భవతిగా మధురిమ ఎక్కడం దిగడంలో శ్రమ పడుతుందని క్రింది పోర్షన్‌గా వుండే ఒక ఇంటికి మారుతారు. ఆ ఇంట్లో శేఖర్ సామాన్లు సర్దుతూ వుంటాడు. మధురిమ ఆఫీసుకు పోతుంది. ఆ ఇంట్లో 'తీవ్రవాది' వున్నాడని సమాచారం అందటంతో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేస్తారు. శేఖర్‌ను తీవ్రవాదిగా భావించి పోలీసులు అతనిపై కాల్పులు జరుపుతారు. శేఖర్ గాయపడతాడు. ఆ తర్వాత అతను తీవ్రవాది కాదని, చాలా మంచివాడని పోలీసులు తెలుసుకొని షాక్ అవుతారు. కాని వారి తప్పును ఒప్పుకుంటే వారి ఉద్యోగాలు ఊడుతాయని, వారి రక్షణ కోసం పోలీసులు అతన్ని నక్సలైట్‌గా చెప్తారు. విప్లవ సాహిత్యం, కొంత మందుగుండు సామగ్రి ఆ ఇంట్లో పడేస్తారు. అతనిపై కోర్టులో కేసు పెట్తారు. మధురిమ అమాయకుడైన భర్త శేఖర్‌ను కాల్చటంతో షాక్ తింటుంది.

శేఖర్ అమాయకుడని, పోలీసులు కావాలని అతనిపై నేరం మోపారని వాదిస్తుంది. ఒక జర్నలిస్టు గీత (టాబు), మధురిమకు సపోర్టింగ్‌గా నిలుస్తుంది. వాదోపవాదాలు విన్న కోర్టు శేఖర్‌కు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధిస్తుంది. అమాయకుణ్ని, నేరస్తుణ్ని చేసినందుకు మధురిమ పోలీసుపై తిరుగుబాటు చేస్తుంది. పోలీస్, మధురిమ మీద పగబట్టుంది. ఆత్మహత్యా నేరంలో ఆమెను బలవంతంగా ఇరికించి ఆమె ఉరి వేసుకొని చనిపోయినట్టు ఆమెను ఉరి తీసి చంపేస్తారు. ఇది షాకింగు విషయంగా విస్తరిస్తుంది.

జైలు నుంచి తిరిగి వచ్చిన శేఖర్ తనను అన్యాయంగా నేరస్తుడిని చేసినందుకు, తన భార్యను అకారణంగా చంపినందుకు పోలీస్‌పై పగ, ప్రతీకారం పూనుతాడు. పోలీసును హతమారుస్తాడు. పోలీసును హతమార్చిన శేఖర్‌ను సిబిఐ ఆఫీసర్ (నాగబాబు) వెంటాడుతాడు. శేఖర్

తరువాయి 11వ పేజీలో

# అంత్రా సాహసం

ప్రేమకథ ఫేం అంత్రామాలి తన సొగసులు చూసి మురిసిపోయే వాళ్లను, ముసిముసిగా నవ్వేవాళ్లను 'మిస్టర్ యా మిస్' చిత్రాన్ని తన దర్శకత్వంలో తీసి భయపెట్టింది. బాలీవుడ్‌లో చాలామంది ఇప్పుడు అంత్రామాలి పేరు వినగానే అమ్మోనంటున్నారు. అయితే అంత్రామాలి ఈ మాటలకు భయపడడం లేదు. పడితేనేం? లేచి పరుగెత్తగల దమ్ము నాకుందని ఈ మధ్య ప్రకటించింది. ఇది విన్నవాళ్లు కొంపదీసి మళ్లీ ఏదైనా సినిమాకు డైరెక్షన్ చేసే పనిలో వుందా ఏమిటి? అని భయపడుతున్న వాళ్లున్నారు.

### ఏం చేసినా కథను బట్టే!

ఇటీవల విడుదలైన 'జవానీ దివానీ'లో ఎమ్రాన్ హష్మితో చేసిన హాట్ హాట్ సీన్లతో సెలీనా జైట్లీ ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేసింది. అంతేకాదు – ఎమ్రాన్‌తోనే నటిస్తున్న మరో కొత్త చిత్రంలో సెలీనా టాప్‌లెస్‌గా నటిస్తుందనే పుకార్లు ఇప్పటికే బాలీవుడ్‌లో షికార్లు చేస్తున్నాయి.

తరువాయి 11వ పేజీలో

# వారఫలాలు

*తేది 25-3-2006 నుంచి 31-3-2006 వరకు మీనంలో రవి, రాహువులు, వృషభంలో కుజుడు; కర్కాటకంలో శని; కన్యలో కేతువు; తులలో గురువు; మకరంలో శుక్రుడు; కుంభంలో బుధుడు; మకర, కుంభ, మీన, మేష రాశులలో చంద్రుడు సంచరిస్తారు.*



## మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1 పాదం)


ఆర్థిక స్థితి సామాన్యంగా వుంటుంది. అనుకున్న పనులకు ఆటంకాలున్నా తొలగుతాయి. వృత్తి, వ్యాపార పరంగా ఇతరులతో అవగాహన చేసుకొంటే మంచిది. గృహ, వాహనాల వల్ల ఖర్చులు అదనంగా వుంటాయి. ఆరోగ్య విషయాలలో జాగ్రత్త అవసరం. వాహనాలు, యంత్రాల నిర్వహణలో మెళకువగా వుండాలి. రావలసిన బాకీలు పెండింగ్‌లో పడతాయి. శుభకార్య ప్రయత్నాలు నెరవేరుతాయి. ప్రయాణాలు ప్రయోజనమివ్వవు. ఉద్యోగ ప్రయత్నాలు కొంత లాభిస్తాయి.



## వృషభం

(కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశీర్ష 1,2 పాదాలు)

అప్పుడప్పుడు చిన్న చిన్న సమస్యలతో నలుగుతుంటారు. పెండింగ్ పనులు పూర్తవుతాయి. ఆర్థికస్థితి బాగుంటుంది. రావలసిన బాకీలు కొంత మేర చేతికందుతాయి. వృత్తి, వ్యాపారాలలో మంచి అవకాశాలుంటాయి. ఉద్యోగులకు పని భారం పెరిగినా అధికార వర్గ ఆదరణ బాగుంటుంది. కుటుంబ వ్యక్తుల, బంధు మిత్రుల సహకారం బాగుంటుంది. శుభ వార్తలు వింటారు. దైవ కార్యాలలో పాల్గొనడం, కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. వాహన సౌఖ్యం, ఆదాయ వృద్ధి వుంటుంది.



## మిథునం

(మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

ఆర్థిక ఇబ్బందులుంటాయి. అవసరాలకు డబ్బు లభించి పనులు పూర్తి చేసుకొంటారు. కొంత రుణ సమస్య వుంటుంది. ఇతరుల వల్ల సమస్యలలో చిక్కుకొనే అవకాశముంది. అధికారుల సహకారం మాత్రం వుంటుంది. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలు, దూర ప్రయాణాలుంటాయి. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో ఆదాయాభివృద్ధికి చేసే ప్రయత్నాలు సఫలమవుతాయి. విద్యార్థులకు ప్రగతి బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలుంటాయి.



## కర్కాటకం

(పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేషలు)

మానసిక అశాంతి, ఒత్తిడి ఎక్కువగా వుంటుంది. అయినా పనులు అనుకున్న విధంగానే నెరవేరుతాయి. వ్యాపార రంగంలో కొద్ది ఇబ్బందులుంటాయి. బంధువర్గంలో విభేదాలు, అపార్థాలు చోటు చేసుకొంటాయి. కుటుంబంలో అనారోగ్య బాధ వుంటుంది. ఆర్థికంగా బాగుంటుంది. దూర దేశ ప్రయాణాలు, ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. శుభకార్యాలలో పాల్గొనడం, వివాహాది కార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. అధికారుల సహకారం బాగుంటుంది. మీపై విమర్శలకు ధీటుగా సమాధానాలివ్వగలరు. సోదరుల సహకారం బాగుంటుంది. విద్యార్థులకు పరీక్షలలో ప్రతిభ బాగుంటుంది.



## సింహం

(మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం)

ఉద్యోగులు ఎక్కువగా శ్రమ పడతారు. అధికారుల వల్ల ఇబ్బందులుండవచ్చు జాగ్రత్త. శ్వాసకోశ రుగ్మతలు బాధిస్తాయి. ఇంట్లో అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, వ్యాపార రంగాలలో ఆదాయం బాగుంటుంది. కేసులు, కోర్టు వ్యవహారాలలో అనుకూలత వుంటుంది. అకాల భోజనం, ఆరోగ్యం సరిగా వుండక బాధ పడతారు. అనుకోని ఖర్చులు పైన బడతాయి. దూర ప్రయాణాలు, ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. అనుకున్న పనులు సరిగా జరగవు. విద్యావృద్ధి బాగుంటుంది. కొన్ని పనులలో సహకరించవలసిన వారు దూరంగా వుంటారు.



## కన్య

(ఉత్తర 2,3,4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు)

వృత్తి, వ్యాపారాలలో అవకాశాలు తప్పి పోతాయి. రావలసిన బాకీలు నిలబడి పోతాయి. కోర్టు కేసులు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులందొకరికి అనారోగ్యం, అనవసర విషయాలలో జోక్యం వల్ల బంధుమిత్రులతో అపార్థాలుంటాయి. ఖర్చుపై అదుపు వుండదు. శుభకార్యాలలో పాల్గొంటారు. అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. వివాహ, ఉద్యోగార్థుల ప్రయత్నాలు ఫలిస్తాయి. స్థిరాస్తులను కొనడం జరుగుతుంది. ఒత్తిడి ఎక్కువగా వుంటుంది. పరీక్షలలో మంచి ప్రగతి వుంటుంది. కొత్త వస్తు, వాహనాలు కొంటారు.

### పంచాంగం

*30తేది గురువారం ఉగాది.*
*వ్యయ నామ సంవత్సర ప్రారంభము.*

**మార్చి తిథులు**

**ఫాల్గుణ కృష్ణ పక్ష**

25 శని ఏకాదశి రా.1.50గం.ల వరకు
26 ఆది ద్వాదశి రా.11.30గం.ల వరకు
27 సోమ త్రయోదశి రా.9.05గం.లవరకు
28 మంగళ చతుర్దశి రా.6.45గం.ల వరకు
29 బుధఅమావాస్యసా.4.20గం.లవరకు

**చైత్ర శుక్ల పక్ష**

30 గురు పాడ్యమి ప.2.10గం.ల వరకు
31 శుక్ర విదియ ప.12.15గం.ల వరకు

**స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఏ.,**



## తుల

(చిత్త 3,4పాదాలు, స్వాతి, విశాఖ1,2,3 పాదాలు)

ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. పెట్టుబడులు, షేర్లలో లాభాలుంటాయి. ప్రభుత్వ సంబంధ పనులలో అధికారులతో జాగ్రత్తగా మెలగాలి. కుటుంబంలో చిన్న చిన్న విషయాలలో విభేదాలుంటాయి. ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి. గాయాలు తగలడం, వాహన రిపేర్లుంటాయి. ఆత్మీయ బంధువులకు ఆరోగ్యం బాగుండక పోవచ్చు. స్థిరాస్తులు, క్రయవిక్రయాలు నిర్ణయమవుతాయి. ఉద్యోగ, శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత వుంటుంది. పరీక్షలలో ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తారు.



## వృశ్చికం

(విశాఖ 4పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఆదాయం సామాన్యంగా వుంటుంది. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధికి అవకాశాలు లభిస్తాయి. పెండింగ్ పనులు, కోర్టు కేసులలో అనుకూలత వుంటుంది. ఉదరకోశ రుగ్మతల వల్ల బాధ వుంటుంది. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. పెళ్లి, ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగ నిర్వహణలో అదనపు బాధ్యతలు పైనబడతాయి. సన్నిహితుల వల్ల కొద్దిపాటి సమస్యలుంటాయి. అనుకోని ప్రయాణాలు తప్పవు. విద్యార్థులు బాగా కృషి చేయాలి. తల్లితండ్రులు, బంధువుల నైపు నుంచి వార్తలు వింటారు. దైవ కార్యాలలో పాల్గొంటారు.



## ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

చేస్తున్న పనులలో అనుకూలత సరిగా వుండదు. అయిన వాళ్ల వల్లనే ఆటంకాలుంటాయి. అవసరానికి రుణం చేయవలసి వస్తుంది. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం. అప్పులు, హామీలు ఇవ్వొద్దు. వృత్తి, వ్యాపార, ఉద్యోగ రంగాలలో ఆదాయం సామాన్యంగా వుంటుంది. విద్యార్థులకు మంచి అనుకూల సమయం. విద్యా ప్రగతి బాగుంటుంది. చిన్న ఉద్యోగాలు లభించవచ్చు. పెళ్లి, క్రయవిక్రయాలు నిర్ణయమవుతాయి. అధికారుల అనుకూలత వుంటుంది. కొత్త పరిచయాలు, నిర్ణయాలుంటాయి.



## మకరం

(ఉత్తరాషాఢ, 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు)

కుటుంబ పరిస్థితులు ప్రోత్సాహకరంగా వుంటాయి. చేస్తున్న పనులలో అనుకూలత బాగుంటుంది. వృత్తి, వ్యాపార, ఉద్యోగ రంగాలలో అనుకోని అవకాశాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను ఉపయోగించుకొంటారు. ఆలోచనలు ఎక్కువగా వుండి అప్పుడప్పుడు ఒత్తిడి పడతారు. ప్రయాణాలు లాభసాటిగా వుండి శుభ వార్తలు వింటారు. ఆర్థికంగా బాగుంటుంది. బ్యాంకింగ్, కోర్టు వ్యవహారాలు అనుకూలిస్తాయి. విద్యార్థులకు మంచి అను కూల సమయం. బాకీలు కొంత వరకు వసూలవుతాయి.



## కుంభం

(ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

అన్నింటా శ్రమ ఎక్కువగాను, ప్రయోజనం స్వల్పం గాను వుంటుంది. ఆర్థిక కుటుంబ సమస్యల వల్ల ఇబ్బందులుంటాయి. కాని గురు వీక్షణ వల్ల అనుకున్న పనులు జరిగిపోతాయి. బంధుమిత్రులతో అభిప్రాయ భేదాలు సర్దుబాటు చేసుకొంటారు. పారిశ్రామిక, రాజకీయ రంగాల వారికి మాత్రం కొంత బాగుంటుంది. అధికార వర్గ సహకారం స్వల్పంగా వుంటుంది. ప్రయాణాలుంటాయి. దైవ, సామాజిక కార్యాలలో పాల్గొంటారు. విద్యార్థులకు మంచి ఫలితాలు లభిస్తాయి. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ఆర్థికాభివృద్ధికై చేసే ప్రయత్నాలలో తొందరవద్దు.



## మీనం

(పూర్వాభాద్ర 4 పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

వృత్తి, వ్యాపారాలలో కొత్త ప్రయత్నాలు చేస్తే కలిసి వస్తాయి. కాని పనులు జరిగే వరకు ఒత్తిడి ఎక్కువగా వుంటుంది. కుటుంబానికి ఆదాయం సామాన్యంగానే వుంటుంది. శుభకార్య, ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. రుణాలు, హామీలు మాత్రం ఇవ్వొద్దు. బాకీల వసూలుకు కృషి చేస్తే ఫలితముంటుంది. అనవసర వ్యవహారాలలో తలదూర్చి ఇబ్బంది పడే సూచనలున్నాయి. కొత్త వస్తువులు కొనడం, వ్యాపార పెట్టుబడులు, షేర్ల వల్ల లాభాలుంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. కొత్త పరిచయాలుంటాయి. దూర ప్రయాణాల కొరకు ప్రయత్నిస్తారు.

---

# జనవాణి

3వ పేజీ కొరవ

నిజానికి శృంగారాంశాలపై కౌన్సెలింగ్ వల్ల శృంగార మాధుర్యం పెంపొందడంతో బాటుగా మరికొన్ని ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా భార్యాభర్తలు మధ్య పరస్పరం గౌరవం, అనురాగం, ఆప్యాయతలు కూడా పెంపొందుతాయి. అందువల్ల పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే కీచులాటలు, విడిపోవడం, వరకట్న వేధింపులు, వివాహేతర శృంగారం వంటి అనర్థాలు కూడా ఇటువంటి కౌన్సెలింగ్ మూలంగా నివారింపబడతాయనడంలో అతిశయోక్తి లేదు.

*నెల్లూరు* *డాక్టర్ ఇ.రాజగోపాలరెడ్డి*

## అమెరికా నమ్మదగిన మిత్రుడు కాదు

ప్రపంచంలో అశాంతికి, అరాచకానికి ప్రతీక అమెరికా. ఆ దేశం కుట్ర, కుతంత్రాలతో ఎంత రౌడీయిజం చేసినా అది ప్రపంచ శాంతే అవుతుంది. దానికి ఐక్యరాజ్య సమితి మద్దతు పలుకుతుంది. అమెరికా అన్ని దేశాల వ్యవహారాల్లో వేలు పెట్టొచ్చు, మరొకరు పెడితే తప్పని ఆ దేశాలను బీభత్సం చేస్తుంది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో అమెరికా సృష్టించిన విధ్వంసాన్ని ఎవరు మరువగలరు? ఇరాన్‌ను ధ్వంసం చేయాలన్న దుష్ట తలంపుతో ప్రస్తుతం ఆ దేశముంది. అమెరికాతో మన్మోహన్‌సింగ్ కుదుర్చుకొన్న అణు ఒప్పందం మూలంగా మన దేశానికి లేని పోని తలనొప్పులు రాకుంటే అదే పదివేలు. సామ్రాజ్యవాద అహంకారంతో విర్రవీగే అమెరికాకు అనుకూలంగా వాస్తు రామచంద్ర 'జమీన్‌రైతు'కు ఉత్తరం వ్రాయడం బాధను కల్గిస్తుంది.

*నెల్లూరు* *టివి నారాయణ*

## కవులను అవమానించారు

స్వర్గీయ ఏసి సుబ్బారెడ్డి శత జయంతోత్సవాన్ని పురస్కరించుకొని 17తేది టౌన్‌హాల్‌లో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. కవి సమ్మేళనం అంటే కవితల్లో కాసింత చమత్కారం, హాస్యం కూడా వుండాలి. అప్పుడే కవి సమ్మేళనం రక్తి కడుతుంది. ఈ కవి సమ్మేళనంలో చమత్కారపూరిత కవితలను అధ్యక్ష స్థానంలో వున్న వ్యక్తి అడ్డుకొని కవులను అవమానించారు. దీని బదులు భజన కవులను నిర్వాహకులు సమ్మేళనం కోసం ఎంపిక చేసి వుంటే బాగుండేది.

*వరిగొండ* *ఎం.దొరస్వామి*

## గంగూలీ మారాలి

భారత జట్టు మాజీ క్రికెట్ కెప్టెన్ సౌరభ్ గంగూలీ పతనానికి ఆయన స్వయం కృతాపరాధమే కారణం. ఆటగాడిగా జట్టులో పూర్తిగా విఫలమయ్యా రాయన. 2003 డిసెంబరు నుంచి 13టెస్టులు ఆడినా ఒక్క దానిలో కూడా చెప్పుకోదగ్గ స్కోరు సాధించలేదు. అంతేకా కుండా గంగూలీ క్రీడాకారులతో సఖ్యత ప్రదర్శించేవాడు కాదు. జట్టులో గ్రూపిజం ప్రోత్సహించడం, తన మాటే చెల్లుబడి కావాలనుకొనే మనస్తత్వం కల్గిన వ్యక్తి. సోమరిగా వ్యవహరిస్తూ ఏనాడు ఫిట్ నెస్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. జగ్‌మోహన్‌దాల్మియా ఆశీస్సులు వుండబట్టే గంగూలీ ఇన్నాళ్లు భారత జట్టులో కొనసా గాడని చెప్పాలి. ఇకనైనా తన ప్రవర్తనా శైలి, ఆటతీరును గంగూలీ మెరుగుపర్చు కోవాలి.

*నెల్లూరు* *ఎం.సుధీర్*

# 50 ఏళ్ల క్రితం

3వ పేజీ కొరవ

నాడు, తన బల్ల మీద రూ.1500ల వెలగల చేతి గడియారాన్ని పెట్టి, తాను కాఫీ బొక్కల వద్ద డబ్బు తీసుకుంటుండే అష్టావధాన సమయంలో కన్ను మూసి కన్ను తెరిచే లోపల గడియారం అంతర్ధానమైంది.

నెల రోజుల తర్వాత గూడూరు ప్రాంతం పెద్ద మనిషి ఒకాయన వచ్చి తన పేరు బైట పెట్టవద్దని చేతులు బట్టుకొని బ్రతిమాలి గడియారం ఇచ్చిపోయినాడట. తమాషా కోసం తాను తీశాననీ, మరు రోజు – మరు రోజు తిరుగా యిస్తామనుకొన్నాననీ, కాని తాను అత్యవసరంగా బెంగుళూరు వెళ్లవలసిన పనుండి వెళ్లాననీ, ఈ గడియారం పోయిన వార్త అక్కడ పత్రికలలో చూసినాననీ, అక్కడ నుంచి వ్రాస్తే తన పేరు పత్రికల్లో ప్రకటింపబడుతుందేమోననే భయంతో, స్వయంగా రావడానికి ఆలస్యమైందని చెప్పి, పేరు బైట పెట్టవద్దని ప్రాధేయపడ్డాడట. సుందరయ్య అనే అర్జునుడు, ఆ ఘరానా అపహర్త అనే గయుడికి అభయమిచ్చాడట. సరే యింతవరకు బాగానే వుంది.

అప్పుడే గడియారం అపహరణ విషయం పోలీసుకు రిపోర్టు చేయబడి వుంది. గడియారం దొరికిన తర్వాత సబ్ యిన్‌స్పెక్టరు సాంబిరెడ్డితో గాకుండా, స్నేహ మర్యాద కాఫీ హోటలు కస్టమర్ సాంబిరెడ్డి గారితో గడియారం దొరికిందని, చాదస్తుడు సుందరరామిరెడ్డి చెప్పాడు. ఆ గడియారాన్ని స్నేహితత్వంగా చేతికి తీసుకొని, పోలీసుతత్వంగా అపహర్త పేరు జెప్పమని సాంబిరెడ్డి గారు అడిగారు. పేరు బైట పెట్టనని అభయ హస్తమిచ్చిన సుందర రామార్జునుడు ధర్మ సంకటంలో బడ్డాడు.

తర్వాత కథ:– సుందరరామిరెడ్డి పేరు బైట పెడతాడా? పోలీసులు యేమి చర్య జరుపుతారు? గడియారం సుందరయ్యకు యిస్తారా? ఈ వివరాలన్నీ వెండి తెర మీద చూడవలెను.

### వినోభాజీ నెల్లూరు రారు

తెలంగాణాలో ఎక్కువ కాలం పర్యటించినందున రాయలసీమ పర్యటనానంతరం తమిళనాడులో ప్రవేసిస్తారని, నెల్లూరుకు రారని తెలుస్తున్నది.

వినోభాజీ పాదధూళి నెల్లూరు మండలానికి సోకక పోవడం దురదృష్టం.

### 32 వాతల కేసు

నెల్లూరు సబ్ మేజిస్ట్రేటు కోర్టులో జరుగుతుండిన వాతల కేసు ఉభయులు రాజీపడిన సందర్భంగా ఉపసంహరింపబడుతుందట.

అది మంచి పనే! బిడ్డను మాత్రం జాగ్రత్తగా కాపాడండి.

– విమర్శకుడు

## లాఠీ వేటు

4వ పేజీ తరువాయి

మద్యం సేవించే అనుమతి వుంది. పేకాటలో లక్షలు పోగొట్టుకొన్న సాధ్యశ్యాలు నెల్లూరులో ఎక్కువ. భార్యల మంగళ సూత్రాలు సైతం కుదువపెట్టి పేకాట ఆడే ఘనులున్నారిక్కడ. ఈ విషయాలను పాత ఎస్పీ కె.శ్రీనివాసరెడ్డి దృష్టికి కొందరు మహిళలు ఫోన్ల ద్వారా తీసుక వెళ్లడంతో ఆయన వీటిపై దాడులకు దిగడంతో క్లబ్బులలో పేకాట ఆగింది. ఆయన తర్వాత ఎస్పీగా వచ్చిన రాజేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి బాటను అనుసరించడంతో క్లబ్బు నిర్వాహకులకు ఊపిరాడలేదు. శివధర్‌రెడ్డి హయాంలో క్లబ్బులు మళ్లీ ఊపిరి పోసుకొన్నాయి. ఆయన ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోక పోవడంతో పోలీసులు క్లబ్బు గడపలు తొక్కను సాహసించలేదు. కొత్త ఎస్పీ సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించాక నగర డిఎస్పీ, సిఐలను పిలిచి క్లబ్బులలో పేకాటను సహించనని వార్నింగ్ ఇవ్వడంతో 17తేది నుంచి పోలీసులు వీటిపై దాడులకు దిగారు. పోలీసులు రావడం చూసి చతుర్ముఖ పారాయణంలో నిమగ్నమై వున్న పెద్దలు తలో దిక్కు పరుగెత్తారు. కొందరు ఔత్సాహికులు జంప్ చేసి మరీ గోడలు దూకి తప్పించుకొన్నారు. ఈ దాడులు కొనసాగించాలని ఎస్పీ నిర్ణయించడంతో క్లబ్బుల నిర్వాహకులు రాజకీయ నాయకులను కలిసే ఆలోచనలో వున్నట్లుంది. పోలీసులు ఈ విషయంలో గట్టిగా నిలిస్తే ఎన్నో కాపురాలు కుప్పకూలకుండా నిలుస్తాయి. ఎస్పీ సూర్యనారాయణ మహిళల మన్ననలు పొందడం ఖాయం.

## మొబైల్

4వ పేజీ తరువాయి

వయసులో వున్న అమ్మాయిలను యాత్రికులకు తోడుగా ఎక్కిస్తారు. మామూలు భోజన వసతి, యాత్ర ఖర్చులు నిర్వాహకులే భరిస్తారు. లాడ్జింగ్, క్లాస్ భోజనపు ఖర్చులు సరసులే భరించాలి. దీనికిగాను వరంగల్ జిల్లా వంగపహాడ్, చిలకలూరిపేట, చీరాల, కాకినాడల నుంచి నెలవారీ అద్దెలు చెల్లించి వయసులో వున్న మహిళలను తీసుకొచ్చి ఈ విహారయాత్రల స్పెషల్ కొనసాగిస్తున్నారు. బంగారు వ్యాపారస్తులు, ఆర్యవైశ్యుల యువకులు ఈ స్పెషల్ యాత్రలపై మక్కువ చూపిస్తున్నారు. ఈ సీరియల్ సరస యాత్రంతా భార్య భర్తలనే ముసుగులో కొనసాగుతుండడంతో ఇప్పటి వరకు అవాంతరాలేవురు కాలేదు. ఊటీ, బెంగుళూరు వైపు బండ్లలో ఒకటి రద్దీగా వుండట. దీనికోసం బయట ప్రాంతాల నుంచి తీసుకొచ్చే యువతులకు ఈ యాత్ర నిర్వాహకులు నెలకు 60వేల దొప్పున చెల్లిస్తున్నారంటే ఎంత చక్కగా ఈ గూత్రా స్పెషల్ సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులకు తెలియకుండా ఈ వ్యవహారం సాగుతుందంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఎందా కాలంలో సరసులను మొత్తం మీద ఈ యాత్రలు సంతృప్తి పరుస్తున్నాయనే చెప్పాలి.

## మత సామరస్యం

4వ పేజీ తరువాయి

డిఎస్పీని ఆదేశించడంతో అరెస్టులు జరిగాయి. ఏసుక్రీస్తు స్తోత్ర కీర్తనల పేరిట హిందూ దేవుళ్లను కించపరిచేలా పాటలు పాడారని దీన్ని నిరసించామే తప్ప దాడులకు దిగలేదని ఆర్ఎస్ఎస్ చెబుతుంది. ఎవరి మతం వారిదైనా, పరమత సహనం పాటించడం ప్రతి ఒక్కరి విధి. దేవాలయాలు, మసీదు, చర్చిలను ఏ మతం ప్రదర్శనలు దాటినా ఆ సమయంలో మౌనం దాల్చడం ఉత్తమం. ఈ విషయాన్ని అన్ని మతాల పెద్దలతో పాటు పోలీసులు విధిగా అమలయ్యేలా చూస్తే ఏ సమస్యలు వుత్పన్నం గావు.

## వసూలురాజా...

4వ పేజీ తరువాయి

అధికారులకు దొరికిన తడలోనే పోస్టింగ్ ఇచ్చారు. దీనికిగాను రమణ్‌నాయక్ 50 లక్షలు ఉన్నతాధికారులకు సమర్పించినట్లు గగ్గోలుగా వుంది. రమణ్‌నాయక్ స్వంత జిల్లా గుంటూరు. ఈ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు సహకారంతో ఎసిబి అధికారులకు ఛాలెంజ్‌గా తడ పోస్టింగ్ పొందినట్లు తెలిసింది. తడ చెక్‌పోస్ట్‌లో ఈ అధికారి నెలసరి ఆదాయం మూడు లక్షలట. మరో మూడు లక్షలు వుటవుడియంగా ఉన్నతాధికారులకు అందిస్తారని ప్రతీతి. అందువల్లే అందరూ బాగా సహకరించారట. ఈ వ్యవహారంలో నెల్లూరు రవాణా కమిషనర్ మోహన్ కీలక పాత్ర వహించినట్లు చెబుతున్నారు. అవినీతి అధికారులకు ప్రభుత్వం ఎంత నిస్సిగ్గుగా మద్దతు పలుకుతున్నదన్న విషయం రమణ్‌నాయక్ తడ పోస్టింగ్‌తో నిరూపితమయ్యింది.



నెల్లూరు మద్రాస్ బస్టాండు వద్ద గల బాలికల హాస్టల్ నుంచి టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న వారికి రిస్ట్ వాచీలు బహూకరిస్తున్న ది నెల్లూరు ఆటో మొబైల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ప్రసాదరావు, వేణుగోపాలరెడ్డి, కె.ఇ.సాయిప్రసాద్ తదితరులు.

## నమ్మక ద్రోహం

4వ పేజీ తరువాయి

లంగా మలచుకొన్నాడు. సురేష్‌ను తన ఇంటికి భోజనానికి పిల్చి బిరియానిలో సైనేడ్ కలిపి పెట్టాడు. దీన్ని తెలియక తిన్న సురేష్ ప్రాణాలు విడిచాడు. భోజనానికి కూర్చొనే ముందు సురేష్ నెల్లూరులోని అతని భార్యకు ఫోన్ చేసి, ఆ రోజే బయలు దేరుతున్న విషయం చెప్పాడు. సురేష్ మృతదేహాన్ని మల్లికార్జున అతని మిత్రులు ఒక ఆటోలో తీసుకెళ్లి నాగార్జున సాగర్ పొరుడల కాల్వలో పడేశారు. ఎంతకు సురేష్ నెల్లూరుకు రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు విచారించను గుంటూరు బయలుదేరి వెళ్లారు. ఆయన భార్య నెల్లూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు గుంటూరు వెళ్లి తీగలాగడంతో డొంకంతా కదిలింది. మల్లికార్జున, అతని స్నేహితులిద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించే సరికి విషయమంతా పూసగుచ్చి నట్లు చెప్పారు. ముగ్గురినీ అరెస్ట్ చేసి నెల్లూరు పోలీసులు కోర్టుకు హాజరు పర్చారు. మనిషి అన్నాక ప్రక్క మనిషిని నమ్మక తప్పదు. కాని గుడ్డిగా నమ్మకూడ దని మల్లికార్జున చేసిన ఘాతుకం లోకానికి చాటి చెప్పింది.

## ఆకాశరామన్నలు

4వ పేజీ తరువాయి

సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 2తేది నుంచి 20తేది వరకు రైతు చైతన్య యాత్రలు జరుగుతాయని, ఈ కార్యక్రమాలలో రైతులకు ప్రధానంగా మోటార్లకు కెపాసిటర్లు, ఫుట్ వాల్స్ వాడకంపై ఉపయోగాలు, అమర్చు కోక పోతే జరిగే నష్టాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద అమలు చేస్తున్న బిందు సేద్యాన్ని నీటి దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. జట్రోపా, పొంగానియా సాగు, దీనికి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని కూడా రైతులకు చెప్పాలన్నారు. జిల్లాలో జట్రోపా సాగుకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడంలో వ్యవసాయాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రైతు చైతన్య యాత్రల కార్యక్రమాలను ట్రాన్స్‌కో, వ్యవసాయాధికాడులు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎవరైనా అధికారులు నిర్లక్ష్యం చేస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకొంటామన్నారు. అదేవిధంగా గ్రామాలలో రాత్రి బసలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారు బస చేసిన గ్రామాలలో ప్రధాన సమస్యలు గుర్తించి, వాటిపై స్పందించాలన్నారు. రైతుల ప్రయోజనం దృష్ట్యా జిల్లాలో ధాన్యసేకరణ కోసం ఇందుకూరుపేట, నెల్లూరు, ముత్తుకూరు, సర్వేపల్లి, అల్లూరు, బోగోలు, బుచ్చిలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చెరకు, శ్రీవరి సాగుపై, అలాగే నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులపై కూడా రైతులకు అవగాహన కల్పించి వారు నష్టపోకుండా చూడాలన్నారు. రైతు చైతన్యయాత్రలు గ్రామాలలో నిర్వహించేటప్పుడు నిర్దేశించిన సమయాలలో జరిపి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ, జాయింట్ డైరెక్టర్ టి.జయరాం, పశు సంవర్థక అధికారి రాజేంద్రప్రసాద్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## పశువులు మాయం

5వ పేజీ తరువాయి

చెయ్యక పోవడం మిస్టరీగానే వుంది. వెదనపర్తి, టిపినాపి, చింతలాత్మకూరులలో జరిగిన పశు దొంగతనాల కేసుల్లో బాధితులే దొంగల్ని గుర్తించగా, అత్యుత్సాహంతో పోలీసులు ఆ కేసులను రాజీ చేసి బాధితులకు నష్ట పరిహారం ఇప్పించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. పోలీసుల పనితీరుకు విసుగెత్తిన బాధితులు పశు దొంగల్ని పట్టుకొనేందుకు రాత్రులు పహారా కాస్తున్నారు. పది రోజుల క్రితం అర్ధరాత్రి పూట పశువులను తోలుకెళ్తున్న ఓ వ్యక్తిని కలువాయికి చెందిన మనమాల రఘురామిరెడ్డి వెంటబడి తరుముకోగా ఆ దొంగ పారిపోయాడు. వెంటనే ఈ విషయాన్ని సెంట్రీ డ్యూటీలో వున్న కానిస్టేబుల్‌కు చెప్పగా... ఈ టైములో వెళ్తే ఆ దొంగ రాళ్లతో కొడతాడంటూ ఆ పోలీసు చెప్పిన సమాధానం కలువాయి పోలీసుల దొల్లతనాన్ని చాటి చెప్పింది. ఎస్పీ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని పశువుల దొంగతనాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాల్సి వుంది.



నటుడు పవన్ కల్యాణ్ నటించిన బంగారం చిత్రం ఆడియో విడుదల సందర్భంగా నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేస్తున్న ఆయన అభిమానులు.

## బరితెగింపు

9వ పేజీ తరువాయి

మవడం వల్ల తనకు డేట్స్ సమస్య వచ్చే అవకాశముందని ఆమె ఆందోళన చెందుతున్నది. అయితే ఇప్పటికే తెలుగులో 'షాక్' కొట్టిందనే సంగతి ఆమెకు తెలీదు. తెలిస్తే ఆమె 'షాక్' అవ్వక తప్పదు.

## అమీషా

9వ పేజీ తరువాయి

రాసిందట. అప్పటి నుంచి రిమ్మి ఏమంటుందో తెలుసా? అనుకుంటాం గాని మౌనాన్ని మించి భాష ఇంకొకటి లేదంటుంది. నిజమే మరి. మాట్లాడి పత్రికల వాళ్లకు మసాల అందించడం కంటే ఏమీ మాట్లాడకుండా వుండడం మంచిదే కదా?

## ఐశ్వర్యకు డూప్

9వ పేజీ తరువాయి

కుటుంబం తనను తీసుకు వచ్చిందనే అర్థం ఈ మాటల్లో ప్రస్ఫుటమవుతుందా?

## ఆంత్రా సాహసం

9వ పేజీ తరువాయి

ఏదైనా కథను బట్టే వుంటుంది. 'జవానీ దివానీ' సినిమా అంతా ముద్దులతోనే సాగుతుంది. ఎందుకంటే ఒక పురుషుడికి, స్త్రీకి మధ్య సాగే శృంగార సంబంధమే అసలు కథ అంటుంది. ఏంచేసినా కథను బట్టే అని చెప్పుకొచ్చింది. మరి షూటింగ్ గ్యాప్‌లో ఎమ్రాన్‌తో సాగించిన వ్యవహారం ఎస్ఎంఎస్‌ల రూపంలో అక్కడక్కడ ఎలా దర్శనమిస్తుందో?

## వర్మే సర్వస్వం

9వ పేజీ తరువాయి

వారాతో కొంతకాలం క్రితం విడిపోయినా, తామిద్దరం యిప్పటికీ మంచి మిత్రులమేనని అంటుందామె. అయినా మళ్లీ పెళ్లి గూర్చి సీరియస్ గానే ఆలోచిస్తున్నానంది. అయితే ముందు నా పిల్లలు కాస్త పెద్ద వాళ్లవ్వాలి. అప్పుడైతే తమ జీవితంలో ఒక కొత్త వ్యక్తిని ఆహ్వానించగలుగుతారు. నా పిల్లల్ని ప్రేమించి, వాళ్లను తన సొంత పిల్లల్లా చూసుకొనే వ్యక్తినే పెళ్లాడతా. నిజానికి అలాంటి వ్యక్తి ఇంకా తారసపడ లేదు అంటోంది పూజ. తండ్రి ప్రేమ నుంచి పిల్లల్ని దూరం చేయాలని ఆమె భావించడం లేదు. ఫరాన్‌ను చూడాలని అడిగినప్పుడల్లా పిల్లల్ని తీసుకొని అతనింటికి వెళ్తుంటా. పిల్లలు కోరుకున్నంత కాలం మేం కలిసి వుండేందుకు ప్రయత్నిస్తానంటుంది.

## చిత్రసమీక్ష

9వ పేజీ తరువాయి

అతన్నుంచి తప్పించుకునేందుకు అడవుల్లో పరుగెత్తుతాడు. సిబిఐ ఆఫీసర్ అతన్ని తరిమి తరిమి, శేఖర్ మంచివాడు కావడంతో అతడిని అభినందించి వదిలేస్తాడు. ఇదీ కథ. షాక్ ప్రాధాన్యం కథలో నిండుకొచ్చింది.

కథలో కొత్త పోకడ, కొన్ని మంచి మలుపులున్నాయి. ప్రేమకు, భార్యాభర్తల అనురాగానికి, ఆత్మీయతకు అర్థం చెప్పా చక్కని దృశ్యాలు చూపబడ్డాయి. అమాయకుడైన శేఖర్‌ను పోలీసులు అసలు విషయం తెలియక తీవ్రవాదిగా భావించి అతన్ని కాల్చటం, ఆ తర్వాత పోలీస్ వారి రక్షణ కోసం శేఖర్‌కు నక్సలైటు రంగు పులమటం, కథలో మంచి మలుపు ఇది. ఉరి వేసుకొని చనిపోయినట్టు పోలీసు బలవంతంగా శేఖర్ భార్య చేత కాగితం వ్రాయించటం, ఆ తర్వాత ఆమెను ఉరి వేసి చంపటం ఇది హృదయాన్ని హత్తుకునే సన్నివేశం. ఇలా ఇంకా కొన్ని బలమైన సన్నివేశాలు చిత్రంలో వున్నాయి.

శేఖర్‌గా రవితేజ చాలా సహజంగా నటించాడు. సరదా సన్నివేశాల్లోను, మానసిక ఘర్షణ దృశ్యాల్లోను పట్టుగా నటించాడు. హీరోయిన్ మధురిమ పాత్రలో జ్యోతిక తనన నటనలోని గొప్పదనాన్ని ప్రదర్శించింది. టాబు సమస్యలను ఎదుర్కొనే ధైర్యాన్ని తన నటనలో చూపించింది. మాట ఒక కళ. ఆ కళలోని మెళకువలతో కోన వెంకట్ పాత్రల పరిధిలో సరితూగే మాటలు వ్రాశాడు, అతుల్ అజయ్ సంగీతం పరిమళించింది. సర్వేశ్వర్ ఫొటోగ్రఫీలో ప్రత్యేకత ఉట్టి పడింది.

రాంగోపాల్ వర్మ ఆదరణతో దర్శకుడుగా మారిన హరీష్ శంకర్, షాక్ కలిగించే ఘటనలను ఈ చిత్రంలో ధీటుగా పేర్చాడు. వాటిని చూడాలనే ఆసక్తిని కథనానికి అల్లుకొని తొలి ప్రయత్నంలోనే చిత్రాన్ని ఆకట్టుకునే విధంగా తీర్చిన అతను తన దర్శక శైలికి తానే షాక్ అయి వుంటాడు.


# మళ్లీ ఐఏఎస్‌ల బదలీలు?

అసెంబ్లీ సమావేశాలు కాగానే ఐఏఎస్ అధికారులను పెద్ద ఎత్తున బదలీ చేయాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి వచ్చినట్లు చెప్తున్నారు. రెండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐఏఎస్ అధికారుల బదలీలు ఆయనకు పెద్ద తలనొప్పిగా వున్నాయి. ఏ అధికారి ఎటువంటి వాడో, ఏ అధికారిని ఎంతవరకు నమ్మవచ్చో తెల్సుకోవడం ఆయన తరం కావడం లేదు. మొదట నుంచి రాజశేఖరరెడ్డి గారికి ఐఏఎస్‌లతో పెద్దగా సంబంధాలు లేవు. ఆయన పాతికేళ్ల రాజకీయంలో అధికారిక పదవులేవీ నిర్వహించక పోవడం, అధికారులతో పరిచయాలు, స్నేహాలు పెంచుకోక పోవడం అందుకు కారణం. కెవి రావు వంటి అతి కొద్ది మందితో మాత్రమే ఆయనకు చనువు వుంది.

> చంద్రబాబు హయాంలో కీలక పదవులు అనుభవించి, రాజ్యం నడిపిన వారే ఇప్పటికీ పెత్తనం చలాయిస్తున్నారు. వీరిలో తన మనుషులెవరో, బాబు మనుషులెవరో తెలుసుకోలేక సిఎం సతమతమవుతున్నారు.

మరొక ప్రక్క తొమ్మిదేళ్ల పాటు రాష్ట్రాన్ని ఏక ఛత్రాధిపత్యంగా పాలించిన చంద్రబాబుకు ఐఏఎస్‌లతో సాన్నిహిత్యం ఎక్కువ. ఆయన పదవీ నిర్వహణ మొత్తం వారి మీదనే ఆధారపడి నడిచింది. తన పార్టీ సహచర నేతలకంటే, ఈ అధికారులనే ఎక్కువగా నమ్మేవారాయన. వారితోనే అధిక భాగం సమయం గడిపేవాడు. అందువల్ల రాష్ట్రంలో చాలా మంది ఐఏఎస్‌లు, చంద్రబాబు స్వంత మనుషులుగా మారిపోయారు. ఆయన అంటే గురుత్వం వారిలో జాస్తి. ప్రభుత్వాన్ని నడిపే పార్టీ మారినా, నేత మారినా వారి విశ్వాస విధేయతలు మాత్రం మారడం లేదు. ఇప్పటికీ పాతిక ముప్పయి మంది ఐఏఎస్ వున్నతాధికారులు చంద్రబాబుతో నిత్య సంబంధాలు నెరపుతూనే వున్నారు. ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ఆయన నుంచి ఫోన్ వస్తే ఆఘమేఘాల మీద పనులు చేసి పెడుతున్నారు. అంతవరకు ఆగితే రాజశేఖరరెడ్డికి వచ్చిన ఇబ్బంది ఏదీ లేదు. కానీ వీరిలో కొందరు రాజశేఖరరెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే తీరులో ప్రవర్తిస్తున్నారన్న అనుమానం కాంగ్రెస్‌వాదులలో వుంది.

అయితే విచిత్రంగా, చంద్రబాబు హయాంలో కీలక పదవులు అనుభవించి, రాజ్యం నడిపిన వారే ఇప్పటికీ పెత్తనం చలాయించే పదవులలో కొనసాగుతున్నారు. ఇరిగేషన్, ఆర్థిక, రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, విద్యుత్ వంటి శాఖలలో చంద్రబాబు హయాంలో సర్వం సహాధికారులుగా వ్యవహరించిన వారే కొనసాగుతుండడం గమనార్హం. వీరిలో మారిన మనుషులెవరో, పాత అలవాట్లు, సంబంధాలు మార్చుకోలేని వారెవరో గుర్తించి జాగ్రత్త పడడం ముఖ్యమంత్రికి చేత కావడం లేదు. ప్రభుత్వం ఇబ్బందులలో పడినప్పుడల్లా ఈ అంశంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమౌతున్నది. అప్పటికప్పుడు కొన్ని మార్పులు చేస్తున్నా, మొత్తం మీద మాత్రం ప్రభుత్వంపై ముఖ్యమంత్రికి సరైన పట్టు దొరకడం లేదు.




ఎల్లంపల్లి వివాదంలో కీలక పత్రాలు, ఫైల్ కాపీలు ప్రతిపక్షం చేతికి చిక్కడంలో ఈ వర్గం ఐఏఎస్ అధికారుల సహకారం, లోపాయికారీతనం వుండి వుండవచ్చునన్న శంక ఇప్పుడు సిఎంను వేధిస్తున్నది. అటువంటి వారిని గుర్తించి, అప్రాధాన్య పోస్టులకు పంపి వేయకుంటే ముందు ముందు తాను చాలా ఇబ్బందులలో పడతానన్న భయం ఆయనలో స్పష్టంగా కన్పిస్తున్నదిప్పుడు. అందువల్ల అధికారగణాన్ని మొత్తం ఒక్కసారిగా పునర్వవస్థీకరించాలని తలపెడుతున్నాడు.

అయితే సమస్య అనేది సెక్రటరియేట్ విభాగాలకు ఆధిపత్యం వహిస్తున్న ఐఏఎస్‌ల కంటే, తన స్వంత పేషీలో వున్న అధికారులతోనే ఎక్కువగా వుందన్న నిజం ఆయనకు అర్థం కావడం లేదన్నది కాంగ్రెస్ వాదులు ఆవేదన. సిఎం పేషీలోని భాను, సుబ్రహ్మణ్యం, ప్రభాకరరెడ్డి తదితరులు మొత్తం అధికార గణాన్ని కులాల వారీగా చీల్చి, స్వంత మనుషులను తయారు చేసుకుంటున్నారని; ముఖ్యమంత్రితో నిమిత్తం లేకుండా వీరే ఆదేశాలు ఇస్తున్నారని; ఆ పోటీలో ఒకరి మధ్య ఒకరికి భేదాభిప్రాయాలు తలెత్తి, ప్రతి అంశమూ రచ్చకెక్కుతున్నాదని, సిఎం పేషీలో రహస్యం అన్నది లేకుండా పోతున్నదని కాంగ్రెస్‌వాదుల అభిప్రాయం. మరీ ముఖ్యంగా భానుపై విమర్శలు వస్తున్నాయి. తన మాట వినని అధికారులను వేధించడం కోసం వారు నిర్వహించే అం

తరువాయి 6వ పేజీలో

SONY Xplod MP3 with 2 YEARS WARRANTY
CAR ZONE
EXTRA FITTING SHOW ROOM
Opp: పెట్రోల్ బంకు, కరెంటు ఆఫీసు సెంటర్, దర్గామిట్ట, నెల్లూరు-4.
Ph: 5529991, 2309790, Cell: 94406 91303

## కృతజ్ఞతాభి వందనములు





కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా నాపై నమ్మకముతో నన్ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించినందులకు
కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారికి, మాజీ ముఖ్యమంత్రి శ్రీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారికి,
పిసిసి అధ్యక్షులు శ్రీ కేశవరావు గారికి, రాష్ట్ర ప్రాథమిక విద్య మరియు గ్రంథాలయశాఖా మంత్రి శ్రీమతి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ గారికి,
జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీ శత్రుచర్ల విజయరామరాజు గారికి, కేంద్ర మంత్రివర్యులు శ్రీమతి పనబాక లక్ష్మి గారికి,
ఒంగోలు పార్లమెంటు సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గారికి,
**జిల్లా శాసనసభ్యులందరికీ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునికి, జడ్పీ ఛైర్మన్ గారికి, డిసిసిబి ఛైర్మన్ గారికి,**
జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు
పేరుపేరున నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు...

**మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి**
జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్
నెల్లూరు